ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
ఆదివారం 29 జూన్ 2025

రాష్ట్రంలో ద్రోహులకు తావులేదు!

● డీఎంకే శ్రేణులకు స్టాలిన్ లేఖ

అడయార్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ద్రోహులకు చోటు లేదని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. 2026లో జరిగే ఎన్నికల్లో డీఎంకే మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు 'ఏక తాటిపైకి తమిళనాడు' అనే ప్రచార కార్యక్రమాన్ని జూలై 1నుంచి ప్రారంభించనున్నట్టు ఆయన శనివారం పార్టీ శ్రేణులకు రాసిన ఓ లేఖలో పేర్కొన్నారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ జూలై 1నుంచి ఏకతాటిపైకి డీఎంకే అనే ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రకాలుగా వంచనకు గురిచేస్తోందని, రాష్ట్రానికి ఒక్క అభివృద్ధి పథకాన్ని కేంటాయించలేదని ఆరోపించారు. తమిళ సంస్కృతిని, ప్రాచీన నాగరికత విశేషాలను చరిత్రపుటల్లో ఎక్కించకుండా మోసం చేస్తోందన్నారు. తమిళ భాషాభివృద్ధికి నిధులు కేటాయించకుండా తమిళ ప్రజల మధ్యే మత విద్వేషాలను రెచ్చగొడుతోందన్నారు. ఇలాంటి వారికి అండగా నిలిచే ద్రోహులకు రాష్ట్రంలో తావులేదన్నారు. ఈ విషయాన్ని ప్రచారం చేయనున్నట్టు తెలిపారు. ఇందుకోసం ఒక ప్రత్యేక యాప్‌ను పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ఎస్ భారతి సమక్షంలో మంత్రి రాజా ఈనెల 25న ఆవిష్కరించినట్టు గుర్తు చేశారు. ఈ యాప్‌తో ద్వారా కింది స్థాయి నుంచి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి వరకు ప్రచారం చేయాలని భావిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎలా అమలు చేయాలన్న అంశంపై సమీక్షా సమావేశం శనివారం జరిగింది. ఇందులో జిల్లా కార్యదర్శులు, లోక్‌సభ సభ్యులు, శాసనసభ సభ్యులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న కలైంజర్ మహిళా సాధికారిక నగదు పంపిణీ పథకం, కలైంజర్ కలల గృహం, ముఖ్యమంత్రి అల్పాహార పథకం, నాన్ ముదల్వన్, పుదుమైపెణ్, తమిళ్‌పుదల్వన్ తదితర పథకాల ద్వారా ఏదో ఒక రూపంలో ప్రతి కుటుంబం లబ్ధి పొందుతోందని, ఈ పథకాల లబ్ధిదారులు ఎన్నికల్లో తమ కూటమి గెలుపునకు మద్దతిస్తారని కూడా తాను బలంగా నమ్ముతున్నట్టు సీఎం స్టాలిన్ పేర్కొన్నారు.



మోగనున్న 'నీటి' గంట

టి.నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో జూలై నుంచి 'వాటర్ బెల్ స్కీం'ను సమర్థవంతంగా అమలు చేయాలని పాఠశాలల విద్యాశాఖ సంచాలకుడు కన్నప్పన్ ఉత్తర్వు జారీ చేశారు. ఈ పథకం సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లా విద్యాధికారులు సహకరించాలని, అవసరమైతే ప్రతి పాఠశాలలో 'ఈ నీటిగంట'ను మోగిస్తున్నారా? లేదా? అనే విషయాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు గంటల తరబడి తరగతి గదుల్లో ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలపైనే దృష్టి సారించడం వల్ల నాలుక పిడచకట్టుకుపోయినా నీళ్ల తాగక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించిన పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్‌మహేష్ పొయ్యామొళి హోసూరులో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో నీటి గంటను ప్రకటించారు. ఆ ప్రకటన కార్యరూపం దాల్చేలా విద్యాశాఖ సంచాలకులు కన్నప్పన్ జూలై నుంచి పాఠశాలల్లో వాటర్ బెల్ స్కీం అమలు చేయడానికి చర్యలు చేపట్టారు. ఆ మేరకు ప్రభుత్వ పాఠశాల్లో జూలై నుంచి ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం 1గంటకు, మధ్యాహ్నం 3గంటలకు గంట కొడతారు. ఆ సమయంలో విద్యార్థులు తమ వెంట తెచ్చుకున్న వాటర్ బాటిల్‌లో ఉన్న మంచినీటిని తాగాలి. వాటర్ బాటిల్ లేని విద్యార్థులు పాఠశాలలో సరఫరా చేస్తున్న గ్లాసెడు మంచినీటిని తప్పకుండా తాగాలి. ఇలా రోజూ మూడు పూటలా మోగే నీటి గంట సమయంలో విద్యార్థులందరూ మంచినీటిని తాగేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ సంచాలకుడు కన్నప్పన్ ఆ ఉత్తర్వులో ఆదేశించారు.

వేగంగా పెరుగుతున్న మేట్టూరు డ్యాం నీటిమట్టం

● కావేరి నదీతీర ప్రజలకు వరద హెచ్చరిక

ప్యారీస్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆ రాష్ట్రాల నుంచి కావేరి నదీ కాలువలో విడుదల చేస్తున్న నీటితో డెల్టా జిల్లా సాగు, తాగునీటి అవసరాలను తీరుస్తున్న సేలం జిల్లా మేట్టూరు డ్యాంలో నీటిమట్టం వేగంగా పెరుగుతూ వస్తోంది. శుక్రవారం 114 అడుగులుగా వున్న డ్యాం నీటిమట్టం ఒక్కరోజులోనే 117.3 అడుగులకు చేరుకుంది. పొరుగురాష్ట్రాల నుంచి విడుదల చేస్తున్న నీటిరాకతో గత మూడురోజులుగా మేట్టూరు డ్యాం నిండుతుండటంతో ప్రజాపనులశాఖ అధికారులు, ఇంజనీర్లు డ్యాం వద్దే మకాం వేశారు. గంటగంటకు నీటి మట్టాన్ని పరిశీలిస్తున్నారు. 120 అడుగుల ఎత్తు కలిగిన మేట్టూరు డ్యాం నీటిమట్టం శనివారం ఉదయం 8 గంటలకు 117.3 అడుగులు నమోదైంది. మరోవైపు డ్యాంలో చేరుతున్న నీటిశాతం వేగంగా పెరుగుతున్న దృష్ట్యా డ్యాం నుంచి సెకనుకు 60వేల నుంచి 70వేల ఘనపుటడుగుల జలాలను కావేరి ప్రధాన నదీ కాలువలోకి విడుడల చేసే అవకాశముంది. అందువల్ల శనివారమే కావేరి నదీ పరివాహక ప్రాంతాల ప్రజలకు వరద ప్రమాద హెచ్చరికలు జారీ చేసిన జలవనరులశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


మేట్టూరు డ్యాం

7నుంచి జనంలోకి ఈపీఎస్

● రోజూ రెండు రోడ్‌షోలు

ప్యారీస్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 10 నెలలే ఉన్న నేపథ్యంలో, ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఇప్పటికే ఎన్నికల పనులకు శ్రీకారం చుట్టాయి. అధికార డీఎంకే, ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకేలు 234 నియోజకవర్గాల్లో ఎన్నికల పనుల నిర్వాహక కమిటీలను నియమించే పనులను ముమ్మరం చేశాయి. మరోవైపు ఈ పార్టీల అధినేతలు బూత్ కమిటీలతో సమీక్షించి పార్టీ ఓటు బ్యాంకు పెరిగేందుకు కృషి చేయాలని సూచనలిస్తున్నారు. 2011-21 వరకు పదేళ్ల పాటు అధికారంలో కూర్చుని ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరిస్తున్న అన్నాడీఎంకే మళ్లీఅధికార పీఠం ఎక్కాలనే ఆలోచనతో నూతనోత్సాహంతో పార్టీశ్రేణులను ప్రోత్సహిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిలో బీజేపీ చేరిన నేపథ్యంలో, మరికొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా చేరేందుకు ముందుకొస్తున్నాయి. ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అన్ని పార్టీల కంటే ఈ సారి అన్ని జిల్లాల్లో తిన్నెలపై ప్రచారాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో కుగ్రామాల నుంచి పట్టణాల వరకు నిర్వహించిన తిన్నెల ప్రచారంలో అన్నాడీంఎకే ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ మంత్రులు, పార్టీ అనుబంధ సంస్థల ప్రతినిధులు ప్రజల వద్దకే వెళ్ళి అన్నాడీఎంకే ప్రభుత్వం హయాంలో సాధించిన విజయాలను సంక్షేమ పథకాలను రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి గురించి వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ ప్రచారంలో నాలుగేళ్ల డీఎంకే ప్రభుత్వంలో హత్యలు, హత్యాప్రయత్నాలు, మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచార ఘటనలు, మాదకద్రవ్యాల వినియోగం తదితర అంశాల గురించి ప్రజలకు వివరించారు. ఇదిలా ఉండగా, డీఎంకే ప్రభుత్వాన్ని ఎలాగైన ఇంటికి సాగనంపాలన్న ఉద్దేశంతో ఈపీఎస్ మెగా కూటమి ఏర్పాటుపై దృష్టి సారించారు.

రాష్ట్రంలో పర్యటన...

అన్నాడీఎంకే ఎన్నికల ప్రచారంలో భాగంగా 'డీఎంకే ప్రభుత్వం నుంచి రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడుకుందాం' అనే నినాదంతో ఈపీఎస్ జూలై 7వ తేదీ తొలి విడత ప్రచారానికి కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. తన పర్యటనలో రోజూ ఆయన రెండు రోడ్‌షోలు నిర్వహించనున్నారు.

తొలి రోజు ఇలా..

ఉదయం 9 గంటలకు వనభద్ర కాళియమ్మన్ ఆలయానికి వెళ్ళి ఈపీఎస్ అమ్మవారిని దర్శించుకుంటారు. ఉదయం 10.30 గంటలకు బ్లాక్ థండర్‌లో మధ్యాహ్న భోజనం చేసి, కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 3 గంటలకు మళ్లీ ఆయన రెడ్‌షో ముగించుకుని సాయంత్రం 5 గంటలకు కారమడైలో పర్యటిస్తారు. మేట్టుపాళయం పర్యటన పూర్తిచేసి రాత్రి 8 గంటలకు గౌండంపాళయం నియోజకవర్గంలో పర్యటిస్తారు. ఈ రకంగా కొంగు మండలంగా పిలవబడుతున్న కోయంబత్తూరు జిల్లాలో జూలై 21వ తేదీ వరకు పర్యటించి ఈపీఎస్ ప్రచారం చేయనున్నారు.



అనుమతించిన ప్రాంతాల్లో...

మరోవైపు ఈపీఎస్ పోలీసుశాఖ అనుమతించిన ప్రాంతాల్లో నడిచే వెళ్ళి రోడ్‌షోలో పాల్గొంటారు. ఆ ప్రాంతాల్లో రైతులు, రైతుల సంక్షేమ సంఘాల నిర్వాహకులు, శ్రామిక వర్గాలు, వివిధ కులవృత్తుల్లో పాల్గొంటున్న కార్మికులు, మహిళలు, సీనియర్ సిటిజన్లతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకుంటారు. ఈపీఎస్ రాకవల్ల కోవైలో అన్నాడీఎంకే శ్రేణులు నూతన ఉత్సాహంతో ఎన్నికల ప్రచారం పనుల్లో పాల్గొననున్నాయి.

కనిమొళి, మంత్రి గీతాజీవన్ ఇళ్లకు బాంబు బెదిరింపు

టి.నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడిలోని డీఎంకే ఎంపీ కనిమొళి, మంత్రి గీతాజీవన్ నివాసగృహాలకు బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. తూత్తుకుడి కురింజినగర్‌లో కనిమొళి నివాసగృహం, బోల్‌పేటలో మంత్రి గీతాజీవన్ ఇళ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చెన్నైలోని 108 అంబులెన్స్ సర్వీసు కంట్రోల్ రూంకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తూత్తుకుడిలో ఉన్న కనిమొళి, మంత్రి గీతాజీవన్ నివాసగృహాల్లో బాంబులు పేలనున్నాయని బెదిరించాడు. వెంటనే కంట్రోల్ రూం అధికారులు ఈ సమాచారాన్ని తూత్తుకుడి పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేశారు. తూత్తుకుడి పోలీసులు బాంబ్ స్క్వాడ్, జాగిలాలలను వెంటబెట్టుకుని కనిమొళి, గీతాజీవన్ ఇళ్లలో గంటకు పైగా మెటల్ డిటెక్టర్లతో ముమ్మరంగా తనిఖీలు చేశారు. చివరకు అవి ఉత్తుత్తి బాంబు బెదిరింపులని నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని బాంబు బెదిరింపులు చేసిన వ్యక్తి ఆచూకీని కనుగొనేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

మా కూటమిలో ఎలాంటి విబేధాలు లేవు


● బీజేపీ రాష్ట్ర చీఫ్ నయినార్

చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయే గెలుస్తుందని, ప్రస్తుతం అన్నాడీఎంకేతో కుదుర్చుకున్న పొత్తు స్థిరంగా ఉందని, రెండు పార్టీల మధ్య ఎలాంటి విబేధాలు లేవని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ స్పష్టం చేశారు. తిరునల్వేలి జిల్లా పాళయంకోటలో శనివారం ఉదయం మహిళలు సహా సుమారు 300 మంది ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'డీఎంకే వద్దు.. ఇకపై డీఎంకే వద్దు' అనే ప్రధానమైన నినాదంతో రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయే పోటీ చేయనున్నదని చెప్పారు. డీఎంకే మిత్రపక్షాలలో మార్పులు వస్తే తప్పకుండా రాష్ట్ర అధికారంలో మార్పు వస్తుందని ఆయన చెప్పారు. ఎన్నికల్లోగా డీఎంకే మిత్రపక్షాల్లో కొన్ని పార్టీలు కూటమికి గుడ్‌బై చెప్పడానికి సిద్ధంగా ఉన్నాయ న్నారు. ఎక్కువ సీట్లకోసం డీఎంకేపై ఒత్తిడి చేస్తామంటూ చెబుతున్న డీపీఐ ఆ విషయమై డీఎంకేతో నేరుగా తలపడటానికి సిద్ధమేనా అని నయినార్ నాగేంద్రన్ ప్రశ్నించారు. డీఎంకే నేతలు ఎన్నికయుక్తులు పన్నినా, అమలుకు సాధ్యం కాని హామీలు ప్రకటించినా ఈ సారి ఆ పార్టీ గెలిచే అవకాశమే లేదన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖకు సంబంధించిన కొత్త కార్యవర్గాల ఏర్పాటుకు సంబంధించి జాబితాలను పార్టీ అధిష్ఠానానికి ఎప్పుడో సమర్పించామని, త్వరలోనే కొత్త కార్యవర్గాలు ఏర్పాటవుతాయని చెప్పారు. రాష్ట్రంలో ఆదిద్రావిడుల పాఠశాలల్లో టీచర్ల కొరత అధికమైందని, ఆ కారణంగా ఆ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య 96 వేల నుంచి 67 వేలకు తగ్గిందని చెప్పారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక పాలన కొనసాగుతున్నట్లు డీఎంకే నాయకులు ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను నిరోధించలేని అచేతన ప్రభుత్వమే అధికారంలో కొనసాగుతోందన్నారు. అదే విధంగా మహిళలకు భద్రత కల్పించడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలంతా డీఎంకే పాలనపై విసిగి వేసారిపోయి, తగిన గుణపాఠం చెప్పడానికి కూడా సిద్ధంగా ఉన్నారని నయినార్ నాగేంద్రన్ చెప్పుకొచ్చారు.


పార్టీలో చేరిన మహిళలతో మాట్లాడుతున్న నయినార్

మా నాన్న పసిబిడ్డలా ప్రవర్తిస్తున్నారు

● ఆయన మాట వినే బీజేపీతో పొత్తుపెట్టుకున్నాం ● డాక్టర్ అన్బుమణి రాందాస్



చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకుడైన తన తండ్రి డాక్టర్ రాందాస్ వృద్ధాప్య సమస్యలతో ఐదేళ్లుగా పసిబిడ్డలా ప్రవర్తిస్తున్నారని, గతంలో జరిగిన సంఘటనలను కూడా మరచిపోతున్నారని ఆ పార్టీ కార్యాచరణ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ వాపోయారు. బీజేపీతో పొత్తు పెట్టుకోమంటూ అన్బుమణి, ఆయన భార్య సౌమ్య తన కాళ్లపట్టుకుని ప్రాధేయపడ్డారని రాందాస్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో అన్బుమణి శనివారం ఉదయం జరిగిన పార్టీ సమాచార ప్రచార విభాగం సమావేశంలో మాట్లాడుతూ... రాందాస్ మాట ప్రకారమే బీజేపీతో పొత్తుపెట్టుకున్నట్లు వివరణ ఇచ్చారు. తైలాపురం గార్డెన్‌లో ఉన్న రాందాస్‌కు ఉన్నట్టుండి డీపీఐ, కాంగ్రెస్ నేతలపై ఎందుకు ప్రేమ పుట్టుకొచ్చిందని, ఇదంతా డీఎంకే తెరవెనుక జరుపుతున్న కుట్ర అని ఆయన అన్నారు. పీఎంకేకు బద్ధశత్రువు డీఎంకే మాత్రమేనని, డీఎంకేకు వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే ప్రచారం సాగించాలన్నారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగైకి కూడా రాందాస్‌పై ఉన్నట్టుండి ప్రేమ పుట్టు కొచ్చిందని, ఇటీవల ఇరువురూ కలుసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. డీపీఐ నేత తిరుమావళవన్ ఎన్నడూ రాందాస్‌ను గౌరవించేలా మాట్లాడలేదని, తీవ్రంగా విమర్శించారే తప్ప ప్రశంసించనే లేదని, అలాంటి వ్యక్తి కూడా ఉన్నట్టుండి తన తండ్రితో సఖ్యతతో మెలగడం విస్మయాన్ని కలిగిస్తోందన్నారు. డీపీఐ నేతలు వన్ని అరసు, రవికుమార్, చిందనైసెల్వన్‌కు కూడా రాందాస్‌పై ఉన్నట్టుండి ప్రేమ పుట్టుకొచ్చిందన్నారు. వీరంతా తమ స్వార్థ ప్రయోజనాల కోసమే రాందాస్‌ను ఉపయోగించుకోవాలని పథకం వేసుకున్నారని చెప్పారు.

తిరుచెందూరు ఆలయ కుంభాభిషేకానికి భారీ ఏర్పాట్లు

● కనిమొళి, మంత్రుల పరిశీలన

చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో జూలై 7న జరగనున్న మహాకుంభాభిషేకం సందర్భంగా చేపడుతున్న భారీ ఏర్పాట్లను రాష్ట్రమంత్రులు పీకే శేఖర్‌బాబు, అనితా రాధాకృష్ణన్, డీఎంకే ఎంపీ కనిమొళి శనివారం ఉదయం పరిశీలించారు. 15 సంవత్సరాల విరామం తర్వాత ఆ ఆలయంలో మహాకుంభాభిషేకం వేడుకలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. జూలై 1న ఆలయంలో యాగశాల పూజలు ప్రారంభమవుతాయి. ఈ వేడుకలకు దేశవిదేశాల నుంచి సుమారు 10 లక్షలమంది భక్తులు తరలివస్తారని ఆలయ, జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించనున్నారు. కుంభాభిషేకానికి విచ్చేయనున్న భక్తుల కోసం తిరునల్వేలి, మదురై, కన్నియాకుమారి జిల్లాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఈ నేపథ్యంలో కుంభాభిషేకం ఏర్పాట్లను కనిమొళి, మంత్రులు పరిశీలించారు. వీరితోపాటు జిల్లా కలెక్టర్ ఇలంభగవత్, జిల్లా ఎస్పీ ఆల్బర్ట్‌జాన్, ఆలయ తక్కర్ అరుళ్‌మురుగన్, హిందూ దేవాదాయ శాఖ అధికారులున్నారు.

తాంబూలం స్వీకరణ...

ఇదిలా ఉండగా తిరుచెందూరు ఆలయ మహాకుంభాభిషేకం ముందస్తు వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం తాంబూల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రాంగణం వద్ద శివాచార్యులు ఆలయ తక్కర్ అరుళ్ మురుగన్, ఆలయ డిప్యూటీ కమిషనర్ జ్ఞానశేఖరన్‌కు మహాకుంభాభిషేకం తాంబూలాన్ని అందజేశారు. మహాకుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించమని కోరుతూ ఈ తాంబాలాన్ని శివాచార్యులు అందించారు. ఇక శుక్రవారం ఉదయం వినాయక పూజలు, సాయంత్రం దిక్పాలకులకు ప్రత్యేక పూజలు, దిశా శాంతి యాగ నిర్వహణ, శనివారం ఉదయం నవగ్రహాలకు ప్రత్యేక పూజలు, సాయంత్రం గ్రామదేవతకు పూజలు నిర్వహించారు. జూలై 1న తొలి యాగశాల పూజ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ద్వాదశ యాగశాల పూజలు జరుపుతారు. ఈ పూజల కోసం రెండు యాగశాలలను నిర్మించారు. నంది, మయూర అలంకారంతో యాగగుండం ఏర్పాటు చేస్తున్నారు. యాగశాలల వద్ద 64 మంది ఓదువార్లు తిరుప్పుగళ్, పన్నిరుతిరుముర్రై సహా సెంతమిళ్ వేద మంత్రాలను పఠించనున్నారు. ఆలయ గిరి ప్రాకారంలో ఉన్న చెట్లలో మిరిమిట్లు గొలిపేలా రంగుల విద్యుద్దీపాలను కడుతున్నారు. జూలై 7 వేకువజాము 12వ యాగపూజలు జరుగుతాయి. ఉదయం 6.15 గంటల నుంచి 6.50 గంటలలోపున ఆలయ గోపురాల కలశాలపై పవిత్రనదీ జలాలలతో సంప్రోక్షణ నిర్వహిస్తారు. ఈ వేడుకలు వీక్షిస్తూ ఆలయం చుట్టూరా నిలిచే లక్షలాదిమంది భక్తులపై ఎనిమిది దిక్కులా 20 డ్రోన్‌లతో సంప్రోక్షణ పవిత్రజలాలను చల్లనున్నారు. ఈ కుంభాభిషేకాన్ని పురస్కరించుకుని జూలై 6 మధ్యాహ్నం నుంచి 7వ తేదీ మధ్యాహ్నం వరకు ఆలయంలో స్వామివారి దర్శనం రద్దు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు.


తిరుచెందూరు ఆలయం వద్ద కుంభాభిషేకం ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు, జిల్లా అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రులు పీకే శేఖర్‌బాబు, అనితారాధాకృష్ణన్, ఎంపీ కనిమొళి

సమాచార దృష్టి

నేటినుంచి వన్ వేగా ఆర్బీఐ సబ్‌వే

పెరంబూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మరమ్మతుల కారణంగా స్థానిక ఆర్బీఐ సబ్‌వే ఆదివారం నుంచి వన్‌గా మార్పు చేసినట్లు గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, చెన్నై బీచ్ నుంచి ప్యారీస్ వైపు వెళ్లేందుకు ఎలాంటి మార్పులు లేవు. ప్యారీస్ నుంచి వచ్చే వారు టన్నెల్ యాక్సిస్ రోడ్డు, నార్త్ ఫోర్ట్ రోడ్డు, ముత్తుస్వామి రోడ్డు, వార్ మెమోరియాల్ మార్గంగా వెళ్లాలని ట్రాఫిక్ శాఖ తెలిపింది.

నేడు, రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా అంబత్తూర్ సిడ్కో పరిధిలోని ఆవిన్ మెయిన్ రోడ్డు కొంత భాగం, 8వ వీధి, పొన్నియమ్మన్ నగర్, అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ 2వ మెయిన్ రోడ్డు, 2వ క్రాస్ మెయిన్ రోడ్డు, 4,5 వీధులు, 11వ వీధి, సౌత్ ఫేస్ సెక్టార్-1, ఎంటీహెచ్ రోడ్డు, 1వ సెక్టార్ నుంచి 2 వరకు ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు తెలిపింది.

సోమవారం...

హస్తినాపురం: రాధా నగర్, జీఎస్టీ రోడ్డు, పార్వతి హాస్పిటల్. **బిసెంట్ నగర్:** బిసెంట్ నగర్ 3, 5 అవెన్యూలు, 4వ మెయిన్ రోడ్డు, 32 నుంచి 35 క్రాస్ వీధులు, ఆల్కాట్‌కుప్పం, కస్టమ్స్ కాలని 1వ వీధి, తిరువళ్లువర్ నగర్, భజన ఆలయ వీధి, ఊరు ఎల్లయమ్మన్ ఆలయ వీధి.
వెస్ట్ తాంబరం: కృష్ణనగర్ 1,8 వీధులు, వెట్రి నగర్, సుభాష్ నగర్, రమణి నగర్, మల్లిక నగర్, కుమరన్ నగర్, సరస్వతి నగర్, పార్వతి నగర్, శ్రీరామ్ నగర్ సౌత్, శ్రీ రామ్ నగర్ నార్త్, బాలకృష్ణన్ నగర్.
నెహ్రూ నగర్: ఆర్బీ రోడ్డు, అయ్యాస్వామి స్కూల్ వీధి, రాజాజీ వీధి, పటేల్ వీధి, శంకర్‌లాల్ వీధి, చిట్లపాక్కం 1వ మెయిన్ రోడ్డు, పాత హస్తినాపురం రోడ్డు, సంతానకృష్ణన్ వీధి, మహాదేవన్ వీధి, రామ్మూర్తి వీధి.

రవ్వ, సేమియా కొనుగోలుకు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థు లకు అల్పాహారం అందజేసేందుకు 1,000 మెట్రిక్ టన్నుల రవ్వ, సేమియా కొనుగోలుకు రాష్ట్ర వాణిజ్య వినియోగ దారుల వాణిజ్య సంస్థ టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్రంలోని 34,987 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 17.53 లక్షల మంది విద్యార్థులకు 'ముఖ్యమంత్రి ఉదయం అల్పాహారం' పథకం అమలులో ఉంది. ఈ పథకానికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.600.25 కోట్లు ప్రభుత్వం కేటాయిం చింది. ఈ పథకాన్ని వచ్చే నెల ఎయిడెడ్ సహా అన్ని పాఠశాలలకు విస్తరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఉదయం అల్పాహారంగా ఉప్మా, కిచిడి, పొంగల్ తదితరాలు అందిస్తున్నారు. అల్పాహారం తయారీకి 1,000 మెట్రిక్ టన్నుల రవ్వ, 900 మెట్రిక్ టన్నుల సంబా రవ్వ, 1,000 మెట్రిక్ టన్నుల సేమియా అందజేసేందుకు ఆన్‌లైన్‌లో టెండర్లు ఆహ్వానించింది. రవ్వ, సంబా రవ్వ కిలో ప్యాకెట్లు, సేమియా 200 గ్రాముల ప్యాకెట్‌గా అందించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు ఉన్నత విద్య అడ్వాన్స్ చెల్లింపు పెంపు

పెరంబూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగు ల పిల్లలకు ఉన్నత విద్య అడ్వాన్స్ చెల్లింపు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ఉన్నత విద్యలో చేరేందుకు ముందస్తు నగదును ప్రభుత్వం అందజేస్తోంది. ఆ ప్రకారం, వృత్తి విద్యకు రూ.50 వేలు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు, పాలిటెక్నిక్ లల్లో చేరేందుకు రూ.25 వేలను ముందస్తు అడ్వాన్స్‌గా అందిస్తున్నారు. ఈ క్రమంలో, ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో 110వ నిబంధన కింద సీఎం స్టాలిన్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగుల పిల్లల ఉన్నత విద్యకు అందజేసే అడ్వాన్స్ నగదు పెంచుతామని ప్రకటించారు. ఆ ప్రకారం, వృత్తి విద్యకు రూ.లక్ష, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు, పాలిటెక్నిక్ లలో చేరేందుకు రూ.50 వేలు అందజేయనున్నట్లు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉదయచంద్రన్ జీవో విడుదల చేశారు.

1 నుంచి ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు

పెరంబూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాం గులకు ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించే ప్రక్రియ జూలై 1 నుంచి చెన్నై సహా 10 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. రాష్ట్రంలో 2.25 కోట్ల బియ్యం రేషన్ కార్డులుండగా, లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వెళ్లి బయో మెట్రిక్‌లో నమోదుచేసి సరుకులు పొందాల్సి ఉంటుంది. కానీ, వృద్ధులు, నడవ లేని స్థితిలో ఉన్న వారు, తమకు బదులు వేరే వ్యక్తి ద్వారా సరుకులు పొందవచ్చు. ఇందుకోసం వారు మరో వ్యక్తిపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో, 70 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించాలని ప్రభుత్వం నిర్ణయిం చారు. జూలై 1 నుంచి 5వ తేది వరకు చెన్నై, తిరునల్వేలి, శివగంగ, దిండుగల్, రాణిపేట, ఈరోడ్, ధర్మపురి, నాగ పట్టణం, నీలగిరి, కడలూరు తదితర జిల్లాల్లో ప్రయోగా త్మకంగా అమలు చేయనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, సెప్టెంబరులో ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించను న్నట్లు ఆహార శాఖ అధికారులు తెలిపారు.

బేకరీ ఉత్పత్తుల తయారీపై రెండు రోజులు శిక్షణ

పెరంబూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30, జూలై 1వ తేదీల్లో బేకరీ ఉత్పత్తులపై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో క్లాసిక్ బ్రౌనీ, బ్లోండీస్ ట్రిపెట్ చాక్లెట్స్, బ్రౌనీ నట్స్, ఓవర్‌లోడెడ్ బ్రౌనీ, ఎగ్‌లెస్ బ్రౌనీ ఫ్రూట్ అండ్ నట్స్, బ్రౌనీ ప్రీమిక్స్ సహా పలు బేకరీ ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, ప్రభుత్వ రాయితీలు, బ్యాంక్ రుణాలపై వివరించనున్నారు. స్థానిక ఈకాట్టు తాంగళ్‌లోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు జరుగనున్న ఈ శిక్షణలో 18 ఏళ్లకు పైబడి టెన్త్ కనీస విద్యార్హతగా ఉన్న పురుషులు, మహిళలు పాల్గొనవచ్చు. శిక్షణ సమయంలో తక్కువ ధరకు అన్ని సౌకర్యాలతో బస వసతి కల్పించనున్నారు. వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్, నెం.866819 2600లో సంప్రదించవచ్చు.

మద్రాసు ఐఐటీలో కెమికల్ ప్రాసెస్ ఇంజనీరింగ్ కోర్సు

పెరంబూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మద్రాసు ఐఐటీ జాంజిబార్ క్యాంపస్‌లో బీఎస్ కెమికల్ ప్రాసెస్ ఇంజనీరింగ్ అనే కొత్త కోర్సు ప్రవేశపెట్టారు. నాలుగు సంవత్సరాల యూజీ కోర్సులో దేశంతో పాటు అన్ని దేశాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన విద్యార్థులు admissions@iitmz.ac.inలో జూలై 5వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని ఐఐటీ ప్రకటన విడుదల చేసింది.

నడిసముద్రంలో మునిగిన పడవ

జాలర్లను కాపాడిన శ్రీలంక నావికాదళం


నీట మునిగిన పడవను తీరం వైపు లాక్కెళుతున్న జాలర్లు

టి.నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తమిళ జాలర్లపై దాడులు జరపడం, పడవలలోని జలసంపదను దోచుకోవడం, జాలర్లను నిర్బంధించడమే ఆనవాయితీగా పెట్టుకున్న శ్రీలంక నావికాదళం తమలో మానవత్వం కూడా దాగి ఉందని నిరూపించింది. ఓ పడవ మునిగి సముద్రంలో కొట్టుమిట్టాడుతున్న జాలర్లను కాపాడి తమిళ జాలర్ల సంఘాల సమాఖ్య నేతల ప్రశంసలందుకున్నారు. రామేశ్వరం సమీపం ధనుష్కోడి నుంచి గురువారం వేకువజామున నాటుపడవలో జాటర్లు ప్రకాష్, సతీష్, గుహన్, నంబుప్రకాష్ సముద్రంలో చేపల వేటకు బయలుదేరారు. శుక్రవారం మధ్యాహ్నం వీరు సముద్రంలో చేపలు పడుతుండగా ఉన్నట్టుండి వీచిన పెనుగాలులకు నాటుపడవ బోల్తా కొట్టింది. దీంతో ఈత తెలిసిన నలుగురు జాలర్లు బోల్తాపడిన పడవచుట్టూ నిలిచి తమను కాపాడాలంటూ తీరంలో ఉన్న మత్స్యశాఖ ఉన్నతాధికారులకు సెల్‌ఫోన్ ద్వారా సందేశం పంపారు. దీంతో రామేశ్వరం నుంచి మూడు పడవల్లో కొంతమంది జాలర్లు బయలుదేరారు. పడవ నీట మునిగిన ప్రాంతానికి వెళ్లారు. మునిగిన పడవను తాళ్లతో కట్టి పైకి లేపేందుకు ప్రయత్నించారు. ఎంత ప్రయత్నించినా కదల్లేదు. ఆ సమయంలో శ్రీలంక నావికాదళం గస్తీ నౌక రావడంతో జాలర్లంతా భయంతో వణికిపోయారు. ఎప్పటిలాగే శ్రీలంక నావికాదళం దాడి జరిపి తమను అరెస్టు చేస్తుందని బిత్తరపోయారు. అయితే క్షణాలలోనే శ్రీలంక నావికాదళం తమిళ జాలర్లతో ఏం జరిగిందని ప్రశ్నించడం, పడవ నీటిలో బోల్తాపడిందని చెప్పడం, వెంటనే వారు తమ గస్తీనౌకలోని తాడును విసిరి మునిగిన పడవ కొక్కికి కట్టి రెండు మూడునాటికల్ దూరం వరకు లాగటం చకచకా జరిగాయి. అటు పిమ్మట జాలర్ల నుంచి సెలవు తీసుకుని శ్రీలంక నావికాదళం వెనుదిరిగింది. అప్పటిదాకా తమ ఎదుట జరిగింది 'కలయో వైష్ణవ మాయయో' అంటూ జాలర్లు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. శ్రీలంక నావికాదళం సభ్యులు చేసిన సహాయం వల్ల జాలర్లు సులువుగా ఆ పడవను తీరానికి చేర్చగలిగారు. తీరానికి చేరిన జాలర్లు శ్రీలంక నావికాదళం చేసిన సహాయం గురించి చెప్పినప్పుడు జాలర్ల సంఘాల సమాఖ్య సభ్యులు కూడా నమ్మలేకపోయారు.

'స్పెల్-బి' పుస్తకావిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇంగ్లీషులో మాట్లాడడం, రాయడం, చదవేందుకు వీలుగా రూపొందించిన 'స్పెల్ -బి' పుస్తకావిష్కరణ శనివారం జరిగింది. స్థానిక గాంధీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి దయాళన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని పుస్తకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్యోతీశ్వరపిళ్లై, ఉపాధ్యాయుల శిక్షణ ప్రొఫెసర్ మధుచందన సహా పలువురు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా భూగర్భ జలాల పన్నుపై రైతుల ధర్నా


ధర్నాలో పాల్గొన్న రైతులు, వివిధ పార్టీల కార్యకర్తలు

ప్యారీస్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములకు వినియోగిస్తున్న భూగర్భ జలాలకు పన్ను విధించనున్నట్లు ప్రకటించిన కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులు పలు ప్రాంతాల్లో శనివారం ఆందోళనలు చేపట్టారు. తంజావూరులో తమిళనాడు రైతుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పలు రాజకీయ పార్టీల కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. వ్యవసాయ భూములకు వినియోగించే భూగర్భ జలాలకు పన్ను విధించాలనే ప్రకటనను వెంటనే వెనక్కు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. అలాగే అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి కూడా భూగర్భ జలాలకు పన్ను విధింపుపై పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తన ఎక్స్‌పేజీలో దేశవ్యాప్తంగా వ్యవసాయానికి వినియోగించే భూగర్భ జలాలకు పన్ను విధించాలన్న నిర్ణయాన్ని కేంద్రం వాపసు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ముగ్గురు కుమార్తెల హత్య

● తల్లికి మూడు యావజ్జీవ శిక్షలు

అడయార్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా విరుదాచలం సమీపంలో తన ముగ్గురు కుమార్తెలను హత్య చేసిన కేసులో కన్నతల్లికి మూడు యావజ్జీవ కారాగారశిక్షలు విధిస్తూ కడలూరు జిల్లా మహిళా కోర్టు తీర్పునిచ్చింది. సాత్తంపట్టికి చెందిన మణికంఠన్, సత్యవతి దంపతులకు అక్షయ(6), నందిని(4), దర్శిణి(2) కుమార్తెలు ఉన్నారు. మణికంఠన్ బోర్‌సెట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో భర్తతో మనస్పర్థలు తలెత్తడంతో పిల్లలను సత్యవతి పుట్టింటికి తీసుకెళ్లి హత్య చేసింది. ఈ విషయం తెలుసుకున్న మణికంఠన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సత్యవతిని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ కడలూరు జిల్లా మహిళా కోర్టులో సాగింది. కేసులోని సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. సత్యవతికి మూడు యావజ్జీవ కారాగారశిక్షలు, రూ.3 వేల అపరాధం విధిస్తూ తీర్పునిచ్చింది.

కన్నదాసన్ జయంతి వేడుకలు


రచయితలకు పురస్కారాలు అందజేస్తున్న వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్

వేలూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఊరీసు కళాశాలలో కంబన్ కళగం తరఫున తమిళ సినీ గేయ రచయిత, ప్రముఖ కవి దివంగత కన్నదాసన్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి కళగం అధ్యక్షుడు, వీఐటీ ఉపాధ్యక్షుడు సెల్వం అధ్యక్షత వహించగా, వీఐటీ వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ... సాహితీ రంగానికి కన్నదాసన్ ఎనలేని సేవలు చేశారని, వేల సంఖ్యలో కవితలు, సాహితీ గ్రంథాలు రచించిన ఆయన, ఇతర భాషల్లోని కవితలను తమిళంలో అనువదించారని కొనియాడారు. కన్నదాసన్ కవితలు అందరూ చదవాలని కోరారు. కార్యక్రమంలో కళగం నిర్వాహకులు సోలైనాథన్, జ్యోతి, బాలు, జ్ఞానవేలు, ఊరీసు కళాశాల తమిళ శాఖ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కన్నదాసన్ కుమార్తె గాంధీ కన్నదాసన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కవులు, రచయితలకు విశ్వనాథన్ పురస్కారాలు ప్రదానం చేశారు.

ధనుష్కోడి వద్ద శ్రీలంక తమిళుల నిర్బంధం



చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నుంచి నాటుపడవలో శనివారం వేకువజామున ధనుష్కోడి తీరానికి వచ్చిన ముగ్గురు శ్రీలంక తమిళులను సముద్రతీర భద్రతాదళం పోలీసులు అరెస్టు చేశారు. రామేశ్వరం సమీపం ధనుష్కోడి సమీపంలో ఇసుకదిబ్బపై ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండటం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సముద్ర తీర భద్రతాదళం గస్తీనౌకలో ఆ ఇసుకదిబ్బ ప్రాంతానికి వెళ్లి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఆ ముగ్గురు శ్రీలంకలోని పేచ్చానై ప్రాంతానికి చెందినవారని తెలుసుకున్నారు. కుటుంబ పరిస్థితుల కారణంగా తాము నాటుపడవలో ధనుష్కోడికి వచ్చామని ఆ ముగ్గురు తెలిపారు. అటుపిమ్మట వారిని మండపం వద్దనున్న శ్రీలంక శరణార్థుల శిబిరానికి తరలించారు.

మద్రాస్ ఐఐటీలో విద్యార్థినిపై అత్యాచారయత్నం

విద్యార్థి సంఘాల ధర్నా ● జాతీయ మహిళా కమిషన్ విచారణ

ప్యారీస్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని మద్రాస్ ఐఐటీ విద్యార్థినిపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటనలో పోలీసులు యువకుడిని అరెస్టు చేశారు. ఈ నెల 25వ తేదీ రాత్రి ఐఐటీ క్యాంపస్‌లో ఒంటరిగా నడిచివెళ్తున్న ఆ విద్యార్థినిని జుట్టుపట్టుకుని ఆ క్యాంపస్ ఫుడ్‌కోర్టులో పనిచేస్తున్న ఓ యువకుడు అత్యాచారానికి యత్నించినట్లు బాధితురాలు కోట్టూరుపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ చర్యలకు పాల్పడిన బిహార్‌కు చెందిన రోషన్‌కుమార్ (22)ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో, ఐఐటీ ప్రాంగణంలో వందల సంఖ్యలో పొరుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థినులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు శనివారం ధర్నా చేపట్టారు. అయితే అనుమతిలేకుండా నిర్వహించిన ఈ ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులను అదుపులోకి తీసుకున్న కోట్టూరుపురం పోలీసులు అమింజిక రైలో ఉన్న కల్యాణమండపానికి తరలించి సాయంత్రం 6 గంటలకు వదిలి పెట్టారు. ఇదిలా ఉండగా, ఐఐటీ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకునేందుకు జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా ముందుకొచ్చింది. కమిషన్ సభ్యులు విచారణకు అనుమతించాలని కోరుతూ రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు.

ఆవడి కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా శరణ్య



ప్యారీస్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతంలోని ఆవడి కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా ఆర్.శరణ్య పదవీబాధ్యతలు స్వీకరించారు. కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన ఎస్ కందస్వామి పదోన్నతిపై ఈరోడ్ జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బదిలీ అయ్యారు. ఆ స్థానంలో కమిషనర్‌గా కడలూరు జిల్లా అడిషనల్ కలెక్టర్ శరణ్య నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు మేయర్ ఉదయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ సూర్యకుమార్, ఇంజనీర్లు తిలగమ్, రవిచంద్రన్, రెవెన్యూ అధికారి పెంచలయ్య తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఖాళీగా వాల్పారై నియోజకవర్గం

పెరంబూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వాల్పారై శాసనసభ నియోజకవర్గం ఖాళీ అని ప్రకటించారు. ఈ నియోజకవర్గ అన్నాడీఎంకే ఎమ్మెల్యే టీకే అములు కందస్వామి అనారోగ్యం కారణంగా ఈ నెల 21వ తేది మృతిచెందారు. ఆయన మరణంతో వాల్పారై శాసనసభ నియోజకవర్గం ఖాళీగా ఉన్నట్లు రాష్ట్ర సచివాలయం గెజిట్‌లో పేర్కొంది.

మొబైల్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్

● బస్ డ్రైవర్ డిస్మిస్

అడయార్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా ఉడుమలైపేటలో మొబైల్ ఫోనులో మాట్లాడుతూ బస్సు నడిపిన డ్రైవర్‌ను రవాణా శాఖ ఉన్నతాధికారులు డిస్మిస్ చేశారు. ఉడుమలై నుంచి వీతంపట్టికి నెం.4 రూట్‌లో ప్రభుత్వ బస్సును నడుపుతున్నారు. ఆ బస్సు డ్రైవరుగా చంద్రశేఖరన్ (62) కాంట్రాక్టు వేతనంపై పనిచేస్తున్నాడు. శుక్రవారం ఆయన మొబైల్ ఫోనులో మాట్లాడుతూ ఒక్క చేత్తో బస్సును నడుపుతుండటాన్ని బస్సులోని ఓ ప్రయాణికుడు గమనించి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఆ వీడియో వైరల్ కావడంతో రవాణా శాఖ అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో ఆయనను విధుల నుంచి డిస్మిస్ చేశారు.

వివాహిత ఆత్మహత్య కేసులో మలుపు

శీలాన్ని శంకించి హతమార్చిన భర్త అరెస్టు


కవిన్ ప్రసాద్, అమరావతి, పసిబిడ్డ ఆదిరన్ (ఫైల్‌ఫొటోలు)

చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా చెన్నిమలై సమీపంలో ఉన్న వెల్లవేడు గాంధీనగర్‌లో రెండు రోజులకు ముందు జరిగిన వివాహిత ఆత్మహత్య కేసు మలుపు తిరిగింది. పోలీసుల దర్యాప్తులో శీలాన్ని శంకించి భర్తే ఆమెను, యేడాది పసిబిడ్డను దారుణంగా హతమార్చినట్లు వెల్లడైంది. వెల్లవేడు గాంధీనగర్‌లో కవిన్ ప్రసాద్, అమరావతి(28) దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు ఆదిరన్(1) ఉన్నాడు. కవిన్‌ప్రసాద్ పెరుందురైలోని ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. గురువారం రాత్రి ముగ్గురూ ఇంట్లో నిద్రపోయారు. శనివారం ఉదయం అమరావతి తన గదిలో ఉరివేసుకుని వేలాడుతుండటం, ఆమె కుమారుడు ఇంట్లోని తొట్టెలో విగత జీవిగా పడి ఉండటం చూసి కవిన్‌ప్రసాద్ దిగ్భ్రాంతి చెందాడు. తొలుత ఉరివేసుకుని వేలాడుతున్న అమరావతిని చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని అమరావతి, ఆమె బిడ్డ మృతదేహాలను స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించారు. ఆ విచారణలో కవిన్ ప్రసాద్ కుటుంబ తగాదాల కారణంగా తన భార్య బిడ్డను హతమార్చి, ఆ తర్వాత ఉరివేసి ఆత్మహత్య చేసుకుందని చెప్పాడు. అయితే పోలీసులు గత రెండు రోజులపాటు జరిపిన తీవ్ర విచారణలో ఆ ఇరువురినీ హతమార్చింది కవిన్ ప్రసాద్ అని తెలుసుకున్నారు. ఆ తర్వాత జరిపిన విచారణలో కవిన్ ప్రసాద్ తన నేరాన్ని అంగీకరించాడు. ఐదేళ్లుగా భార్య శీలాన్ని శంకించి ఆమెతో గొడవపడుతూ ఉండేవాడినని, గురువారం రాత్రి తమ ఇరువురి నడుమ గొడవలు జరుగటంతో ఆగ్రహంతో ఆమెను, పసిబిడ్డను హత్య చేసినట్లు వాంగ్మూలం ఇచ్చారు. దీనితో కవిన్ ప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.

అరక్కోణం వద్ద పట్టాలు తప్పిన విద్యుత్ రైలు

టి.నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా అరక్కోణం సమీపంలో చెన్నై నుంచి వెళుతున్న విద్యుత్ రైలు పట్టాలు తప్పింది. చిత్తేరి నుండి కాట్పాడికి వెళుతున్న 9 బోగీల విద్యుత్ రైలు ఉన్నట్టుండి పట్టాలు తప్పి ప్రమాదానికి గురైంది. ఆ రైలింజన్‌కు చేరువగా ఉన్న మూడో నెంబర్ బోగీ చక్రాలు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదం కారణంగా అరక్కోణం మీదుగా కాట్పాడికి వెళ్లే అన్ని రైళ్లను రద్దు చేశారు.

అడయార్ రోడ్డులో కారు బోల్తా



టి.నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ సిగ్నల్ వద్ద శనివారం వేకువజాము వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ స్వల్పగాయంతో బయటపడ్డారు. ఆ కారు రోడ్డు డివైడర్‌ను వేగంగా ఢీకొని బోల్తాపడింది. కారులో ప్రయాణించినవారెవ్వరూ గాయపడలేదు. డ్రైవర్ మాత్రం స్వల్పంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసును నమోదు చేసుకుని, కారును రోడ్డు పక్కకు తొలగించారు.

కుమార్తెను హతమార్చిన తండ్రి

పెరంబూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో 27 ఏళ్ల కుమార్తెను హతమార్చిన తండ్రి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. టి.మడపుదూర్‌కి చెందిన అర్జున్ కుమార్తె అభిద (27) ఓ యువకుడిని ప్రేమిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై కుమార్తెను అర్జున్ పలుమార్లు మందలించి, అతనితో మాట్లాడడం నిలిపివేయాలని సూచించాడు. తండ్రి మాటలు లక్ష్యపెట్టని అభిద, సదరు యువకుడితో ప్రేమను కొనసాగించింది. శుక్రవారం రాత్రి ఈ విషయమై తండ్రి, కుమార్తె మధ్య వాగ్వాదం జరిగింది. అర్జున్ ఆవేశంతో అభిద గొంతును గట్టిగా పట్టుకోవడంతో ఊపిరాడక ఆమె మృతిచెందింది. అనంతరం అర్జున్ సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

విద్యార్థినిపై దాడి

మాజీ ప్రియుడి అరెస్ట్

ప్యారీస్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని అన్నా వర్సిటీ ప్రాంగణంలోకి చొరబడి విద్యార్థినిపై దాడికి పాల్పడిన ఫిర్యాదులో ఆమె మాజీ ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో పలు వాస్తవాలు వెలుగు చూశాయి. ఇతర విద్యార్థులతో సన్నిహితంగా ఉంటున్న విద్యార్థినిని ఆమె ప్రియుడు గట్టిగా మందలించినా ఎలాంటి మార్పు రాలేదని తెలిసింది. దీనితో ఆగ్రహించిన ఆ ఇంజనీరింగ్ విద్యార్థి ఆ వర్సిటీలోకి చొరబడి తన ప్రియురాలిపై దాడికి పాల్పడటంతో పాటు అతనితో ఆ విద్యార్థిని సన్నిహితంగావున్న ఫొటోలను చూపించి బెదిరిస్తున్నట్లు బాధిత విద్యార్థిని కోటూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సంబంధిత యువకుడిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

ఆలయ హుండీలో పొగలు

పెరంబూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం ఏకాంబరనాథర్ ఆలయ హుండీలో పొగలు రావడంతో భక్తులు ఆందోళన చెందారు. ఈ ఆలయ రాజగోపురం, ఉత్సవమూర్తుల సన్నిధులు, ప్రాకారాలకు జీర్ణోద్ధరణ పనులు చేపట్టాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. జీర్ణోద్ధరణ పనులకు పెద్ద మొత్తంలో నగదు అవసరం కానుండడంతో, భక్తులు విరాళాలు సమర్పించేలా ఆలయ ప్రవేశద్వారం వద్ద హుండీ ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం హుండీ నుంచి పొగలు రావడాన్ని గమనించిన భక్తులు ఆలయ నిర్వాహకులకు తెలియజేశారు. నిర్వాహకులు అక్కడకు చేరుకుని పొగలు అదుపుచేసి హుండీ తెరిచి పరిశీలించారు. అందులో రూ.2,000 విలువైన రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్లు కాలి ఉండడం గమనించారు. అలాగే, హుండీలో రూ.99,918 నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదుతో శివకాంచి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కీళక్కరై మున్సిపాలిటీ కమిషనర్ సస్పెన్షన్

పెరంబూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా కీళక్కరై మున్సిపాలిటీ కమిషనర్ రంగనాయకి శనివారం పదవీ విరమణ పొందనున్న నేపథ్యంలో, ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కారైక్కుడి మున్సిపాలిటీలో పనిచేస్తున్న సమయంలో రంగనాయకిపై వచ్చిన ఆరోపణల ఆధారంగా సస్పెండ్ చేసినట్లు సమాచారం.


డెయిరీ యజమాని ఆత్మహత్య

పెరంబూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రుణం తీర్చాలని బ్యాంక్ అధికారులు ఒత్తిళ్ల కారణంగా డెయిరీ యజమాని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటన మదురైలో చోటుచేసుకుంది. మల్లపట్టికి చెందిన రాజపాండి పదేళ్ల నుంచి డెయిరీ నడుపుతున్నాడు. ఆయన రెండేళ్ల క్రితం ఓ ప్రైవేటు బ్యాంక్ నుంచి రూ.3 కోట్లు రుణంగా పొందాడు. కొద్దికాలంగా వ్యాపారంలో నష్టం రావడంతో రుణ బకాయిలకు సంబంధించిన వాయిదాలు సక్రమంగా చెల్లించలేదు. ఈ నేపథ్యంలో, వాయిదాలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్న బ్యాంక్ అధికారులు, డెయిరీ, ఇళ్లు జప్తు చేసేందుకు నోటీసులు జారీచేశారు. ఆ నోటీసులు చూసి మానసికంగా కుంగిపోయిన రాజపాండి రెండు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. ఈ క్రమంలో, మదురై బస్టాండ్‌లో విషం తాగి ఆత్మహత్య చేసుకున్న స్థితిలో రాజపాండి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

వేలూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో దంపతులు మృతి చెందారు. నూరాన్‌కుప్పం గ్రామానికి చెందిన రైతు రమేష్ (43), భార్య గోమతి (36)తో కలసి శనివారం ఉదయం వేలూరుకు ద్విచక్రవాహనంలో బయల్దేరారు. ఆ సమయంలో బెంగళూరు నుంచి చెన్నైకు వెళుతున్న కంటైనర్ లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో రమేష్, గోమతి ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న విరింజిపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ ఆకాశ్ యాదవ్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.


ముగ్గురు విద్యార్థుల అదృశ్యం



వేలూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అరియూ తిరువళ్లువర్ నగర్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు అదృశ్యం కావడంపై పోలీసులు విచారిస్తున్నారు. గోకుల్ ప్రసాద్ (13), భవానినగర్‌కు చెందిన కృష్ణన్ (12), కేకే నగర్‌కు చెందిన జీవసూర్యన్ (12) తొరప్పాడిలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ముగ్గురు ఇంటికి తిరిగిరాలేదు. వారి కోసం పలు ప్రాంతాల్లో గాలించిన తల్లిదండ్రులు బాగాయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ముగ్గురు విద్యార్థులు సినిమాలో నటించాలన్న ఆశతో చెన్నైకి వెళ్లి ఉండొచ్చని ప్రాథమిక విచారణలో తెలుసుకున్న పోలీసులు, వారి కోసం చెన్నై బయల్దేరి వెళ్లారు.

పూవై జగన్‌మూర్తి అరెస్టుకు రంగం సిద్ధం

● 4 ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు



చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కలాంబాక్కం వద్ద జరిగిన బాలుడి కిడ్నాప్ వ్యవహారంలో హైకోర్టు బెయిలు నిరాకరించడంతో పురట్చిభారతం నాయకుడు, కేవీకుప్పం శాసనసభ్యుడు పూవై జగన్‌మూర్తి అరెస్టుకు పోలీసులు సన్నద్ధమయ్యారు. హైకోర్టు బెయిలు పిటిషన్‌ను తోసిపుచ్చినట్లు తెలియగానే ఆయన అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. ఆయన్ను అరెస్టు చేయడానికి 4 ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటయ్యాయి. సీబీసీఐడీ డీఎస్పీ వేల్‌మురుగన్, ముగ్గురు సీఐల నాయకత్వంలో ఈ బృందాలు జగన్‌మూర్తి ఆచూకీకోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఆయన తరఫు న్యాయవాదులు సోమవారం లోపున సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ సమర్పించనున్నారని జగన్‌మూర్తి అనుచరులు చెబుతున్నారు.



భగవద్గీత విశిష్టతపై ప్రసంగిస్తున్న భాష్యకర్త వివేకానంద

సుజ్ఞానంతోనే సరైన జీవితం

● ట్రూత్ వివేకామృతం స్థాపకుడు వివేకానంద

ప్యారీస్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సుజ్ఞానంతోనే సరైన జీవితం సుసాధ్యమవుతుందని, ఇందుకోసం ప్రతి మానవుడు భగవద్గీతలోని సారాంశాన్ని అర్థం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ట్రూత్ వివేకామృతం స్థాపకుడు, భాష్యకర్త వివేకానంద పేర్కొన్నారు. టి.నగర్‌లోని ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్లూటీఎఫ్) కార్యాలయంలో 'ఆత్మ జ్ఞానం అనే అంశంపై రెండ్రోజుల ఆధ్యాత్మిక ప్రసంగం, శిక్షణ కార్యక్రమం శనివారం ఉదయం 9 గంటలకు డబ్ల్యూటీఎఫ్ సంయుక్త కార్యదర్శి కె.శ్రీలక్ష్మీ మోహన్‌రావు ప్రారంభించారు. ఈ తొలి రోజు భగవద్గీత, గరుడ పురాణ సారాంశాన్ని భాష్యకర్త వివేకానంద ఉపదేశించారు. దివ్యజ్ఞానమే దైవమని, జీవాత్మ, ఆత్మ, పరమాత్మలను అనుసంధానించేదే జ్ఞానమని అన్నారు. జ్ఞానం ద్వారా పాపాత్ములు విముక్తి పొందవచ్చని భగవద్గీతలో శ్రీకృష్ణుడు బోధించారన్నారు. జ్ఞానం తెలుసుకుంటే మానవుడు విశ్వవిజేతగా వర్ధిల్లుతాడని, జ్ఞానంతోనే భగవంతుడ్ని కూడా చూడవచ్చన్నారు. విలువలతో కూడిన జీవితం సమాజాన్ని మారుస్తుందని, మతం అంటే అర్థం అభిప్రాయమన్నారు. పాపసముద్రం నుంచి జ్ఞాననౌక ద్వారా బయటపడవచ్చని శ్రీకృష్ణుడి బోధనలు ప్రతి ఒక్కరు అనుసరించాలని వివేకానంద తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు సంధ్యా సాంబశివరావు ఏర్పాట్ల పర్యవేక్షించి, శ్రీలక్ష్మీ మోహన్‌రావులు ప్రవచనకర్త వివేకానందను ఘనంగా సత్కరించారు.

బీజేపీతో పొత్తు పెట్టుకోం



● టీవీకే అధినేత విజయ్

ప్యారీస్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మతశక్తులకు తమ పార్టీ దూరంగా ఉంటుందని, బీజేపీతో ఎట్టిపరిస్థితుల్లో పొత్తు కుదుర్చుకోబోమని తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ స్పష్టం చేశారు. జూలై 4న టీవీకే రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం పనైయూరు పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నోటిఫికేషన్ విడుదల కాకముందే రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రచారం చేపట్టాలని విజయ్ ముందడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తమిళనాడు అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో విజయ్ పార్టీ కూటమిలో చేరే అవకాశముందని ఇటీవల ప్రకటించారు. దీనిపై స్పందించిన విజయ్.. పొత్తులు తమకు అవసరం లేదన్నారు. కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీతో పొత్తుకు సంబంధించి ఎలాంటి చర్చలు జరపలేదని, అయితే సోషల్ మీడియాలో వస్తున్న కథనాలను తాను పట్టించుకోవడం లేదని విజయ్ తెలిపారు.

టి.నగర్‌లో గ్రాండ్ కాంటినెంటల్ హోటల్



హోటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు

అడయార్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లో 'గ్రాండ్ కాంటినెంటల్ ప్రీమియర్ టి నగర్' పేరుతో స్టార్ హోటల్ ప్రారంభమైంది. ఈ హోటల్‌ను వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ శివ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ గ్రూపులో ఇది 22వ హోటల్ అని చెప్పారు. ఇందులో 28 నుంచి 48 చదరపు మీటర్ల విస్తీర్ణంలో విశాలమైన 72 ఫర్నిచర్ వెల్ డిజైన్డ్ గదులు ఉన్నాయన్నారు. అతిథులు హాయిగా సేద తీరేందుకు రూఫ్‌టాప్ స్విమ్మింగ్‌పూల్, సైట్‌ఫిట్నెస్ సెంటర్‌తో పాట 24 గంటల పాటు అందుబాటులో ఉండే మల్టీక్యూసిన్ రెస్టారెంట్, స్టైలిష్ బార్ తదితర సౌకర్యాలు ఉన్నాయన్నారు. అలాగే, కార్పొరేట్, సోషల్ ఈవెంట్ల నిర్వహణ కోసం నాలుగు కాంటెంపరరీ మీటింగ్ హాళ్లు ఉన్నాయని ఆయన వివరించారు.

కమల్‌కు సీఎం స్టాలిన్ అభినందన

అడయార్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక ఆస్కార్ ఆహ్వాన కమిటీలో సభ్యుడిగా చేరాలంటూ అగ్రనటుడు కమల్ హాసన్‌కు ఆహ్వానం రావడాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అభినందించారు. ఇదే విషయంపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'కమల్ హాసన్‌కు నా అభినందనలు. భాష, దేశ సరిహద్దులను దాటి చిత్రపరిశ్రమపై మీకున్న ప్రేమాభిమానాలకు దక్కిన అరుదైన గౌరవం. ముున్ముందు మరిన్ని ఉన్నతస్థానాలు మిమ్మలను వరిస్తాయి' అని ఆయన పేర్కొన్నారు. అలాగే, తనకు అభినందనలు తెలిపిన సీఎం స్టాలిన్‌కు కమల్ కూడా కృతజ్ఞతలు తెలిపారు.


ఇజ్రాయెల్, ఇరాన్ నుంచి తిరిగొచ్చిన తమిళులు



సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న తమిళులు

పెరంబూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయెల్, ఇరాన్ నుంచి ఇప్పటివరకు 114 మంది తమిళులను రక్షించి స్వరాష్ట్రానికి తీసుకొచ్చారు. యుద్ధం కారణంగా ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల నుంచి రాష్ట్రానికి తిరిగొచ్చిన 12 మందిని సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం మంత్రి నాజర్ ఆహ్వానించారు. వారు మినహా, కన్నియాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడికి చెందిన 22 మంది తిరువనంతపురం రైల్వే స్టేషన్‌కు వచ్చి అక్కడి నుంచి స్వగ్రామాలకు వెళ్లినట్లు తెలిసింది. రెండు దేశాల నుంచి ఇప్పటివరకు 144 మంది తమిళులు సురక్షితంగా రాష్ట్రానికి చేరుకున్నారని మంత్రి తెలిపారు.

కుట్రాలం జలపాతంలో కొట్టుకొచ్చిన ఉడుము



అగ్నిమాపక సిబ్బందికి చిక్కిన ఉడుము

ప్యారీస్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పర్వత శ్రేణులు, అడవులు, పశ్చిమ కనుమలు అధికంగా ఉన్న తెన్‌కాశి జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా చెరువులు, వాగులు, నీటివనరులు జలకళ సంతరించుకున్నాయి. ప్రముఖ పర్యాటక కేంద్రమైన కుట్రాలంలో ఐదు జలపాతాల్లో పర్యాటకులు స్నానమాచరించడానికి విధించిన నిషేధం నాలుగు వారాల తర్వాత శుక్రవారం రద్దయ్యింది. ఇందువల్ల ఇక్కడున్న జలపాతాలకు పెద్దసంఖ్యలో పర్యాటకులు వెళ్లి కొండపై నుంచి కిందకి జారుతున్న నీటిలో సరదాగా స్నానమాచరించారు. ఇదిలా ఉండగా, కుట్రాలం ప్రధాన జలపాతంలో మహిళలు స్నానమాచరిస్తుండగా కొండపై నుంచి నీటి ప్రవాహంలో ఓ ఉడుము కొట్టుకొచ్చింది. దీనితో అక్కడున్న మహిళలు పరుగుతీశారు. దీనిపై అందజేసిన సమాచారంతో రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది ఉడుమును పట్టుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

వజ్రోత్సవ దిశగా 'పోలీస్ డాగ్ స్క్వాడ్'

● చెన్నైలో తొలిసారి ఏర్పాటు
● రెండో ప్రపంచ యుద్ధంలో కీలక పాత్ర

అడయార్, ఆంధ్రజ్యోతి

హత్యలు, చోరీలు, పేలుడు పదార్థాల గుర్తింపు, డ్రగ్స్ తరలింపు వంటి నేరాల్లోని చిక్కుముడులను ఛేదించడానికి పోలీసుల ఆయుధమే జాగిలం. నేరం జరిగిన ప్రదేశంలో సాక్ష్యాలను గుర్తించడం, నేరగాళ్ల ఆచూకీ తెలుపుతాయి. అయితే, ఈ పనులు చేయడానికి వాటికి ప్రత్యేక శిక్షణ ఇస్తుంటారు. అలాంటి జాగిలాల శిక్షణ కోసం స్థాపించిందే పోలీస్ డాగ్ స్క్వాడ్. దేశంలోనే తొలిసారి చెన్నైలో ప్రారంభించారు. ఈ దళం నిపుణులు 73 యేళ్లుగా ఎన్నో జాగిలాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో, ఆ జాగిలాలు సమాజ రక్షణలో కీలక పాత్రను పోషిస్తున్నాయి. చెన్నైలో 1952 డిసెంబరు 15న పోలీస్ డాగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. అయితే, శునకాలకు శిక్షణ ఇవ్వడం 1946కు ముందు నుంచే ప్రారంభమైంది. వీటికి శిక్షణ ఇచ్చేందుకు మాన్యువల్‌ను తయారు చేశారు. అప్పటి డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఎన్.కృష్ణస్వామి దీన్ని రూపొందించగా, ఆ ప్రకారమే జాగిలాలకు తర్ఫీదు ఇస్తున్నారు. ఈ డాగ్ స్క్వాడ్ వజ్రోత్సవాల దిశగా అడుగులు వేస్తోంది.



ఆహారం భుజిస్తున్న శునకాలు - శునకాలకు పౌష్టికాహారం - గ్లూకోజ్ పానీయం తాగుతున్న శునకం

నేరాల ట్రాకింగ్‌లో కీలక భూమిక...

చెన్నై మహానగరంలో జరిగే అనేక కేసుల్లో ఈ పోలీస్ స్క్వాడ్‌కు చెందిన శునకాలు అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నాయి. అనేక కేసుల పరిష్కారానికి దారి చూపించాయి. ఇందుకోసం డిటెక్టివ్ డాగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసి, దాన్ని పోలీస్ విభాగంలో చేర్చారు. తొలుత చెన్నైలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌ను మదురై, తిరుచ్చి, కోయంబత్తూరులకు విస్తరించారు. ప్రస్తుతం అన్ని జిల్లాల్లో డిటెక్టివ్ డాగ్ యూనిట్లు సేవలందిస్తున్నాయి.



స్నానం తర్వాత శునకాలను తువ్వాలుతో తుడుస్తున్న సిబ్బంది

విదేశాలకు దీటుగా శిక్షణ...

చెన్నైలోని పోలీస్ డాగ్ స్క్వాడ్ విభాగంలో జాగిలాలకు శిక్షణ అంతర్జాతీయ స్థాయిలో ఇస్తున్నారు. గతంలో బాంబులను పసిగట్టే శునకాలకు శిక్షణ ఇప్పించేందుకు విదేశాలకు తీసుకెళ్లేవారు. కానీ, ఇపుడు చెన్నై, కోవైలలో డిటెక్టివ్ కుక్కలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక స్కూల్‌ను ఏర్పాటు చేశారు. నేరాల ట్రాకింగ్, పేలుడు పదార్థాలు, డ్రగ్స్ గుర్తింపు, నేరగాళ్ల ఆచూకీ కనుగొనడం ఇలా అనేక విధాలుగా సేవలు అందిస్తున్నాయి.



బంతాట ఆడుతున్న శునకం

పాలు, బ్రెడ్, గుడ్లు...

ఈ యూనిట్‌లో కొత్తగా చేరిన కుక్కపిల్లలకు బలవర్థక ఆహారాన్ని అందిస్తారు. ప్రతి రోజూ ఉదయం గ్లూకోజ్, రోజుకు మూడుపూటలా పోషకాహారం అందజేస్తారు. వీటిలో పాలు, గుడ్లు, బియ్యం, బ్రెడ్, రాయల్ కాన్ వంటివి ఉంటాయి. ఆ తర్వాత ఈ శునకాలకు స్నానం చేయించి, పొడిగుడ్డతో శుభ్రంగా తుడిచి దుస్తులు ధరించిన పిమ్మట కొంతసేపు శిక్షణ ఇస్తారు.

ఎమోషనల్ బాండింగ్‌తో ట్రైనింగ్...

ఈ శిక్షణ ప్రధానంగా ఎమోషనల్ బాండింగ్‌తో సాగుతుంది. అపుడే అవి తమ విధులను సక్రమంగా నిర్వహిస్తాయని ట్రైనర్ల విశ్వాసం. తొలి ఆరు నెలల పాటు ఎమోషనల్ బాండింగ్, ఆ తర్వాత ఆరు నెలలు 18 రకాలైన వ్యాయామాల్లో శిక్షణ ఇస్తారు. వీటిలో నిర్ణీత సమయానికి నిద్ర లేవడం, కూర్చోవడం (నిశ్చింతగా నిలబటం), సెల్యూట్ చేయడం, విశ్రాంతి తీసుకోవడం, దొర్లడం, దూర నియంత్రణ, చేతుల సైగలు, మాట్లాడటం, నిశ్శబ్దంగా ఉండటం, దూరంగా విసిరేసిన వస్తువును తిరిగి తీసుకుని రావడం, ఆహారాన్ని తిరస్కరించడం వంటి పనుల్లో శిక్షణ ఇస్తారు. యేడాది తర్వాత ఆ జాగిలాలు ఏం నేర్చుకున్నాయన్న అంశంపై పరీక్ష కూడా నిర్వహిస్తారు. ఇందుకోసం మూడు రకాల వ్యాయామాలు చేయిస్తారు. ఇలా 13 నెలల ట్రైనింగ్ తర్వాత అప్పటికే బాగా తర్ఫీదు పొంది సేవలు అందిస్తున్న స్నిఫర్ డాగ్‌లతో కలిసి పది రోజుల పాటు విధులకు పంపుతారు. ఆ తర్వాత ఒంటరిగా విధులు నిర్వహించేలా ట్రైనింగ్ ఇస్తారు. సాధారణంగా జాగిలాల జీవితకాలం 15 యేళ్లు కాగా, అవి 11 సంవత్సరాల వరకు విధులు నిర్వహిస్తాయి. ఆ తర్వాత పదవీ విరమణ చేసినట్లుగా ప్రకటించి, మాధవరంలోని డాగ్ గార్డ్‌కు పంపుతారు.

కొత్తగా చేరిన 11 కుక్కపిల్లలు...

చెన్నైలోని డిటెక్టివ్ డాగ్ యూనిట్‌కు కొత్తగా మరో 11 కుక్కపిల్లలను నగర పోలీస్ కమిషనర్ అందజేశారు. వీటిలో రెండు పిల్లలను సెయింట్ థామస్ మౌంట్ యూనిట్‌కు, మరో తొమ్మిదింటిని కీల్పాక్ డిటెక్టివ్ డాగ్ యూనిట్‌కు అందజేశారు. ప్రస్తుతం కీల్పాక్ స్నిపర్ డాగ్ యూనిట్‌లో 16 శిక్షణ పొందిన జాగిలాలున్నాయి. వీటితో పాటు కొత్తగా చేరిన 9 కుక్కపిల్లలు ఉన్నాయి. కొత్తగా చేర్చిన వాటిలో ఎనిమిది మగ కుక్కలు కాగా, ఒకటి ఆడ జాగిలం ఉంది. ఈ యూనిట్‌లో మొత్తంగా 27 స్నిపర్ డాగ్‌లు ఉన్నాయి.

నా బిడ్డ సొంతంగా నిర్ణయం తీసుకోవాలి

చిత్రజ్యోతి

● విజయ్ సేతుపతి



'ఫీనిక్స్' ఆడియో రిలీజ్ దృశ్యం

ఏ విషయంలోనైనా తన కుమారుడు సూర్య విజయ్ సేతుపతి స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలన్నదే తన కోరిక అని ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి అన్నారు. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు తొలిసారి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఫీనిక్స్'. సూర్య విజయ్ సేతుపతి హీరో. అభినక్షత్ర, వర్ష హీరోయిన్లు. వరలక్ష్మి శరత్‌కుమార్, సంపత్ తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు. ఏకే బ్రేవ్‌మ్యాన్ పిక్చర్స్ పతాకంపై నిర్మించారు. శ్యామ్ సీఎస్ సంగీతం. నిర్మాత రాజలక్ష్మి ఏఎస్ఎల్ అరసు. ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుక శుక్రవారం జరిగింది. ఇందులో విజయ్ సేతుపతి ముఖ్య అతిథిగా పాల్గొని ట్రైలర్‌ను రిలీజ్ చేసి మాట్లాడుతూ... 'దర్శకుడు అనల్ అరసుకు ప్రత్యేక ధన్యవాదాలు. 2019లో ఈ కథ చెప్పారు. ఆ సమయంలో ప్రాజెక్టు చేపట్టేందుకు వీలుపడలేదు. ఆ తర్వాత ఈ స్టోరీలో నటిస్తే ఎలా ఉంటుందని సూర్య అడిగాడు. ఒక వైపు సంతోషం, మరోవైపు భయం. ఏ నిర్ణయమైన నీవే స్వతంత్రంగా తీసుకోవాలని చెప్పా. నాకు సంబంధించిన ప్రతి విషయాన్ని కుటుంబ సభ్యులతో చర్చిస్తా. కానీ, సూర్య విషయంలో స్వతంత్రంగా తీసుకోవాలని సూచించా. నా బిడ్డకు ఇలాంటి అవకాశాన్ని కల్పించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. సినిమా చాలా బాగా వచ్చింది. నాకంటే నా భార్యకు సంతోషంగా ఉంది' అన్నారు. హీరో సూర్య విజయ్ సేతుపతి మాట్లాడుతూ... 'ఈ అవకాశాన్ని ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. కొన్ని సందర్భాల్లో నిరుత్సాహంగా ఉన్న సమయంలో చిత్ర యూనిట్ సభ్యులు ప్రోత్సహించారు. దేవదర్శిని చిత్రంలోనే కాదు.. నిజ జీవితంలో కూడా నాకు తల్లి వంటివారు. దర్శకుడు అనల్ అరసు అనేక విషయాలు చెప్పించారు. ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరుతున్నా' అన్నాను. దర్శకుడు అనల్ అరసు మాట్లాడుతూ.. 'దాదాపు 200కు పైగా చిత్రాలకు స్టంట్ మాస్టర్‌గా పనిచేశా. కానీ, ఒక దర్శకుడిగా తొలి చిత్రం ఇది. ప్రతి ఒక్కరూ చూడాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు. నిర్మాత రాజలక్ష్మి మాట్లాడుతూ.. ' అందరికీ ధన్యవాదాలు. ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరికీ వద్దకు తీసుకెళ్ళాలని కోరుతున్నా' అని అన్నారు.

రామ్ వంటి మరో దర్శకుడు అవసరం

● దర్శకుడు బాలా



వెట్రిమారన్, బాలా, రామ్

రామ్ వంటి ఒక దర్శకుడు తమిళ చిత్రపరిశ్రమకు అవసరమని ప్రముఖ దర్శకుడు బాలా అన్నారు. జియో హాట్‌స్టార్, జికేఎస్ ప్రొడక్షన్స్, సెవెన్ సీస్ అండ్ సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా రామ్ దర్శకత్వంలో రూపొందిన ఫీల్ గుడ్ మూవీ 'పరందు పో'. వచ్చే నెల 4న విడుదలకానుంది. శివ, క్రేజీ ఆంటోని, మాస్టర్ మిథున్ రియాన్, అంజలి, అజు వర్గీస్, విజయ్ యేసుదాస్ తదితరులు నటించారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుక తాజాగా నగరంలో జరిగింది. ఇందులో చిత్రపరిశ్రమకు చెందిన దాదాపు 30 మంది దర్శకులు పాల్గొని ఆడియోను రిలీజ్ చేసి చిత్ర యూనిట్ సభ్యులను అభినందించారు. ఈ వేడుకలో పాల్గొన్న దర్శకుల్లో కస్తూరిరాజా, విక్రమన్, బాలాజీ శక్తివేల్, శశి, వెట్రిమారన్, బాలా, విజయ్, నిర్మాతలు ధనుంజయ్, సురేష్ కామాక్షి, సీనియర్ కెమెరామెన్ పీసీ శ్రీరామ్,హీరో సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో బాలా మాట్లాడుతూ... మీకు పాదాభివందనం చేసి అడుగుతున్నా.. ఈ చిత్రాన్ని ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లి విజయవంతం చేయాలని కోరుతున్నా' అని కోరారు. హీరో శివ మాట్లాడుతూ... 'దర్శకుడు రామ్ మనందరికీ లభించిన మాణిక్యం. నా కోసం ఇక్కడకు తరలి వచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. చిత్రాన్ని విజయవంతం చేయాలి' అని కోరారు. హీరోయిన్ అంజలి మాట్లాడుతూ... 'కొన్ని చిత్రాల్లోని పాత్రలు మన మనసుకు హత్తుకునేలా ఉంటాయి. నాకు అలాంటి చిత్రమే 'పరందు పో'. రామ్ దర్శకత్వంలో కమర్షియల్ సినిమా వస్తే ఎలా ఉంటుందో అదే ఈ చిత్రం' అని పేర్కొన్నారు.


సంఖ్యా శాస్త్రాన్ని నమ్ముకున్న క్రేజీ హీరోయిన్!



మీనాక్షి చౌదరి

తమిళ, తెలుగు చిత్రపరిశ్రమల్లో క్రేజీ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన హీరోయిన్ మీనాక్షి చౌదరి తన అదృష్టాన్ని కాకుండా, సంఖ్యాశాస్త్రాన్ని నమ్ముకున్నారు. తమిళంలో కంటే తెలుగులో వరుస అవకాశాలు దక్కించుకుంటున్న ఈ భామ.. కోలీవుడ్‌లో విజయ్ అంటోని నటించిన 'కొలై' ద్వారా ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ హీరోగా నటించిన 'ది గోట్'లో నటించారు. అయితే, మాలీవుడ్ యువ హీరో దుల్కర్ సల్మాన్ నటించిన 'లక్కీ భాస్కర్' సినిమా విడుదలైన అన్ని భాషల్లో సూపర్‌డూపర్ హిట్ అయింది. ఆ తర్వాత తెలుగులో వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం కూడా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడంతో ఆమె స్టార్ హీరోయిన్‌గా ఎదిగిపోయారు. ఆ తర్వాత ఈ అమ్మడుకు సరైన అవకాశాలు లభించలేదు. దీంతో తన పేరులో చిన్నమార్పులు చేసుకుంది. తన పేరులోని "MEENAKSHI CHAUDHARY' అక్షరాలకు బదులుగా ఇపుడు ఒక 'ఏ' అక్షరాన్ని చేర్చి "MEENAAKSHI CHAUDHARY' గా పేరు మార్చుకున్నారు.

హీరోగా మారిన దర్శకుడు శక్తి కార్వణ్ణన్



'ఆట్టి'లో ఓ దృశ్యం

'పరమశివన్ ఫాతిమా' చిత్ర దర్శకుడు శక్తికార్వణ్ణన్ కథనాయకుడిగా మారారు. 'మేదగు' చిత్ర దర్శకుడు కిట్టు దర్శకత్వంలో శక్తి కార్వణ్ణన్ హీరోగా నటించిన చిత్రానికి 'ఆట్టి' అనే పేరు పెట్టారు. యధార్థ సంఘటన ఆధారంగా చేసుకుని, ఐదుగురు వీర మహిళల గాథగా రూపొందించనున్నారు. ఇటీవల విడుదలైన 'పరమశివన్ ఫాతిమా'ను శక్తి కార్వణ్ణన్ తెరకెక్కించి, ప్రశంసలు అందుకున్నారు.ఇందులో హీరోకు సమానమైన పాత్రను ఆయన నటించి శెభాష్ అనిపించుకున్నారు. ఇపుడు 'ఆట్టి' మూవీలో హీరోగా పోలీస్ అధికారి పాత్రలో నటించారు. అభినక్షత్ర హీరోయిన్. కాదల్ సుకుమార్, సౌందర్‌తో సహా పలువురు ముఖ్య తారాగణం నటించారు. 'మా కులానికి చెందిన మహిళలదే మొదటిస్థానం' అనే కథాంశంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రధానంగా చరిత్రలోని ఒక వాస్తవిక అంశాన్ని ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని రూపొందించారు. ఊటీ, కున్నూరు, కారైక్కుడి తదితర ప్రాంతాల్లో చిత్రీకరించారు. లక్ష్మి క్రియేషన్స్ పతాకంపై శక్తి కార్వణ్ణన్ నిర్మించగా, ధీసన్ సంగీతం అందించారు.

జోలార్‌పేట వద్ద రైలు ప్రమాదంపై మాక్ డ్రిల్

పెరంబూర్, జూన్ 28: రైలు ప్రమాదం జరిగి బోగీలు పడిపోవడం... ఎన్డీఆర్ఎఫ్ బృందాల రాక... బోగీల్లో చెలరేగుతున్న మంటలను అదుపుచేయడం... బోగీ నుంచి ప్రయాణికులను కాపాడటం... వారిని అంబులెన్స్‌లో తరలించడం... తదితరాలు చూసి తిరుపత్తూర్ జిల్లా జోలార్‌పేట, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు హడలిపోయారు. చివరకు అదంతా చెన్నై డివిజన్ ఆధ్వర్యంలో రైలు ప్రమాద బాధితులను కాపాడేలా నిర్వహించిన మాక్ డ్రిల్ అని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. రైలు ప్రమాదాలను అడ్డుకొనేలా రైల్వే శాఖ పలు చర్యలు చేపట్టింది. పటిష్ఠ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు, రైలు పట్టాలను గ్యాంగ్‌మన్ 24 గంటల పర్యవేక్షణ, ప్రమాదాలు జరిగిన సమయంలో సత్వరం చేపట్టాల్సిన చర్యలు తదితరాలు చేపడుతోంది. ఈ క్రమంలో, చెన్నై రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో శనివారం జోలార్‌పేట యార్డ్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. చెన్నై డివిజన్ సేఫ్టీ, సివిల్ డిఫెన్స్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రభుత్వ రైల్వే పోలీసు వింగ్స్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్), తమిళనాడు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (టీఎన్‌డీఆర్ఎఫ్), మెట్రోపాలిటన్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎండీఎఫ్), సెయింట్ జాన్ అంబులెన్స్ విభాగాలకు చెందిన సుమారు 1,000 మందికి పైగా పాల్గొన్నారు. ఈ మాక్ డ్రిల్‌ను ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ గణేష్, అడిషినల్ రైల్వే మేనేజర్ తేజ్‌ప్రతాప్ సింగ్, సీనియర్ డివిజినల్ సేఫ్టీ ఆఫీసర్ సత్యశీలన్, సీనియర్ డివిజినల్ సెక్యూరిటీ కమిషనర్ బి.రామకృష్ణ, తిరుపత్తూర్ జిల్లా కలెక్టర్ కె.సుందరవల్లి, ఎస్పీ శ్రేయాగుప్తా సహా పలువురు అధికారులు పర్యవేక్షించారు. రైలు ప్రమాదానికి గురికావడం, బోగీల్లో చిక్కుకున్న క్షతగాత్రులను రక్షించడం, వారికి ప్రాథమిక చికిత్సలు అందించి అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి పంపడం, బోగీల్లో అలుముకున్న మంటలు అదుపుచేయడం తదితరాలు మాక్ డ్రిల్‌గా నిర్వహించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో అన్ని విభాగాలు ఎలా సమన్వయంతో పనిచేయాలి అనే విషయంపై అవగాహన కల్పించేందుకు ఈ మాక్ డ్రిల్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.



ప్రమాదానికి గురైన బోగీలు





బోగీల్లో చిక్కుకున్న క్షతగాత్రులను రక్షిస్తున్న పోలీసులు - అంబులెన్స్‌లో ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు



బోగీలో మంటలు అదుపు చేస్తున్న దృశ్యం





■ శ్రీవారి సేవలో ప్రముఖులు

హెచ్‌కే పాటిల్ - సమీర్

తిరుమల, జూన్28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం కర్ణాటక మంత్రి హెచ్‌కే పాటిల్, సినీనటుడు సమీర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

కన్నుల పండువగా జగన్నాథ రథయాత్ర

సూళ్లూరుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో శనివారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా సాగింది. వీక్షించిన భక్తజనులు పరవశించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో రథయాత్ర భక్తుల కోలాహలం.. హరేరామ సంకీర్తనల నడుమ.. చిన్నారుల వేషధారణలు, కోలాటం.. భక్తుల భజనలతో షార్ బస్టాండు నుంచి ప్రారంభమైన 4 కిలో మీటర్ల దూరం సాగింది. షార్ బస్టాండు వద్ద వందలాది మంది భక్తుల జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాల మధ్య ఇస్కాన్ టెంపుల్ వారు పూజలు జరిపి రథోత్సవాన్ని ప్రారంభించారు. ప్రారంభమైన వెంటనే కారుమబ్బులు కమ్ముకుని ఒక నిమిషం పాటు ఆ ప్రాంతంలో తేలికపాటి జల్లుతో కూడిన వర్షం పడింది. ఇదంతా స్వామి మహిళ అని అక్కడి భక్తులు చర్చించుకోవడం కనిపించింది. ఫ్లైవోవర్ బ్రిడ్జి, జీఎన్‌టీ రోడ్డు మీదుగా రథాన్ని ఊరేగించారు. వేలాది మంది భక్తులు రథాన్ని లాగుతూ భక్తిని చాటారు. చెంగాళమ్మ ఆలయం సమీపంలోని శ్రీనగర్ కాలనీ వద్ద యాత్రను ముగించారు. ఈ సందర్భంగా భక్తుల నృత్యాలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



శ్రీవారి దర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.02 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,229

తలనీలాలు సమర్పించినవారు: 30,559

కథనం, ఇంటర్వ్యూ
తడ, సూళ్లూరుపేట (ఆంధ్రజ్యోతి)

తమిళనాడు సరిహద్దు నియోజకవర్గం సూళ్లూరుపేట. అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన శ్రీహరికోట రాకెట్ కేంద్రం, జాతీయ పారిశ్రామిక విజయపతాకం శ్రీసిటీ, ప్రకృతి ప్రసాదించిన వరం పులికాట్ సరస్సు ఈ నియోజకవర్గం కీర్తి కిరీటాలు. ఈ రిజర్వుడు నియోజకవర్గంలో రాజకీయంగా నిలదొక్కుకోవడం ప్రతి నిత్యమూ ఒక సవాలే. స్టెతస్కోప్ చేతబట్టుకుని అమాయకంగా రాజకీయ ప్రవేశం చేసిన నెలవల విజయశ్రీ తొలి ఏడాదిలోనే గట్టి ఎమ్మెల్యే అనే పేరు తెచ్చుకున్నారు. జనంలో తిరుగుతూ, సమస్యలు తెలుసుకుంటూ, అసెంబ్లీలో ప్రస్తావిస్తూ, అధినేతకు విన్నవించుకుంటూ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఈ ఏడాది కాలంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా ఆమె సాధించినవీ, జనం ఆశిస్తున్నవీ, నెరవేర్చాల్సిన హామీల సమాహార సమీక్ష...



పులికాట్ ఫైలు కదిలింది!

- రూ.98కోట్లతో పూడికతీత పనులు మొదలవుతున్నాయి
- ఈ ఏడాదిలోనే మీజూరు చెక్‌డ్యాంల పనులు చేపడతాం
- అటవీ అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నా ● కాళంగి గ్రాయిన్ ఫైలు కదిలింది

? ఈ ఏడాదిలో ఎమ్మెల్యేగా మీరు సూళ్లూరుపేట నియోజకవర్గానికి చేసిన పనులేమిటి

! సుమారు రూ.150 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టాం. నిరంతరం ప్రజల్లో తిరుగుతూ ఉన్నపుడు కష్టాల్లో ఉన్న అనేకమంది తారసపడ్డారు. వీరికి సీఎం సహాయ నిధి నుంచి రూ.3 కోట్లు మంజూరు చేయించా.

● నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీల్లో రూ.8.42 కోట్లతో పనులు చేపట్టాం. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో రూ.5.62 కోట్లతో 29 పనులు చేయించాం. నాయుడుపేట మున్సిపాలిటీలో రూ.2.80 కోట్లతో 34 పనులు చేపట్టాం.



? పులికాట్‌లో పూడికతీత అన్నది మా కలగానే మిగిలిపోయింది.ప్రభుత్వాలు మారుతున్నాయిగానీ పని జరగడం లేదు. ఎమ్మెల్యేగారూ.. మీరు కూడా గత నాయకుల లాగే ఎన్నికల సమయంలో పూడిక తీయిస్తామని హామీ ఇచ్చారు. నెరవేరుస్తారనే ఆశతో ఉన్నాం.

- జయచంద్రన్, మత్స్యకారుడు, బీవీ పాలెం, తడ మండలం

! నేనిచ్చిన హామీని మరచిపోలేదు. పులికాట్ పూడికతీత గురించి సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం రూ.98 కోట్లు నిధులిచ్చింది. ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా టెండర్లు కూడా పిలిచారు. జూలైలో టెండర్లు ఖరారవుతాయి. వెంటనే పనులు మొదలవుతాయి.

-ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



? చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మారిస్తే చెరువు కింద 14గ్రామాల ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుందని మేమంతా ఎన్నికల సమయంలో మిమ్మల్ని కోరాం. మీరు కూడా సానుకూలంగా స్పందించారు. మాట నిలబెట్టుకోండి ఎమ్మెల్యేగారూ.

- చెంబేటి రామయ్య, రైతు, చెంబేడు, పెళ్లకూరు మండలం

! ఇచ్చిన మాట నెరవేర్చి తీరుతాను. రూ.16 కోట్ల అంచనా వ్యయంతో చెంబేడు మినీ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. సీఎంవోకు పంపించాం.నిధుల కోసం సీఎం చంద్రబాబును అభ్యర్థించాం.ఈ ఏడాదిలో పనులు మొదలు పెట్టించేందుకు ప్రయత్నిస్తున్నా.

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



? ఎమ్మెల్యేగారూ మీజూరు వద్ద చెక్‌డ్యాంలు కట్టిస్తామని ఎన్నికలకు ముందు మీరు హామీ ఇచ్చారు.చెక్‌డ్యాంలు కట్టిస్తే వాన నీరంతా పులికాట్‌లో కలిసిపోకుండా ఆగుతుంది.మీజూరు, వేలికాడు, నాగినేరి, కారికాడు, బేరుజంగాలపల్లి గ్రామాలకు చెందిన 7 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

-వి. వెంకటేశ్వర్లు, మీజూరు , దొరవారిసత్రం మండలం

! 2018లో టీడీపీ ప్రభుత్వం ఇక్కడ నాలుగు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం మొదలుపెట్టింది. కేంద్ర అటవీ శాఖ అభ్యంతరాలతో పునాదుల దశలోనే పనులు ఆగిపోయాయి. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇపుడు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును కోరాం.అటవీ శాఖ అనుమతులు కూడా తెప్పించి ఈ ఏడాదిలో పనులు చేపడతాం.

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



? పులికాట్‌లో ఉండే ఊరు మాది. కొరిడి-పేర్నాడు బాట బాగుంటేనే బయటి ప్రపంచంతో మాకు సంబంధాలుంటాయి. ఈ మట్టి రోడ్డులో ప్రయాణం అంటే నడుములు విరిగిపోతాయి. వాన కురిస్తే కాలు కూడా కదపలేం.గెలిస్తే తారు రోడ్డు వేయిస్తానని మీరు హామీ ఇచ్చారు. గెలిచారు. ఏడాది అయ్యింది. మమ్మల్ని పులికాట్‌కి వదిలేయద్దమ్మా అని వేడుకుంటున్నాం.

- ఆకాశ పాలెయ్య రాగన్న పట్టెడ, సూళ్లూరుపేట మండలం

! ఈ రోడ్డును నేను వదిలేయలేదు. పర్యావరణ పరంగా ఇది సున్నితమైన ప్రాంతం. 23 కిలోమీటర్ల కొరిడి-పేర్నాడు తారు రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతించడం లేదు. ఈ ప్రాంత ప్రజల కష్టాల గురించి అసెంబ్లీలో ప్రస్తావించాను.సీఎం, డిప్యూటీ సీఎంలను కలసి విన్నవించా. జూలైలో డిప్యూటీ సీఎంను మరోసారి కలసి అటవీ అనుమతులు తెప్పించేందుకు కృషి చేస్తా.ఈ ఏడాదిలోనే పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నా.

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

ఏడాదిలో ఏం చేశారు?

సూళ్లూరు పేట ఎమ్మెల్యే

డాక్టర్ నెలవల విజయశ్రీ



ఐదేళ్ళ విరామం తర్వాత ఫ్లెమింగో ఫెస్టివల్ తిరిగి ప్రారంభించిన దృశ్యాలు

సూళ్లూరుపేట నియోజకవర్గానికి ప్రపంచ పర్యావరణ, పర్యాటక రంగంలో గుర్తింపు తెచ్చిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పునరుద్ధరించే విషయంలో ఎమ్మెల్యే విజయశ్రీ కీలక పాత్ర పోషించారు. 2020 జనవరిలో చివరిసారిగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించగా తర్వాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం వచ్చాకే ఈ ఏడాది జనవరిలో ఈ బర్డ్ ఫెస్టివల్‌ను తిరిగి ప్రారంభించింది. దీనికోసం విజయశ్రీ సీఎం చంద్రబాబును కలసి గట్టి ప్రయత్నం చేసి, ఘనంగా నిర్వహించారు.

కొరిడి-పేర్నాడు రోడ్డు దుస్థితి





గత వైసీపీ ప్రభుత్వంలో నాయుడుపేట పట్టణంలో విన్నమాల మెయిన్ రోడ్డు దుస్థితి



విన్నమాల మెయిన్ రోడ్డు ప్రస్తుత స్థితి


● నియోజకవర్గంలో అయిదేళ్లుగా అతీగతీ లేకుండా దారుణ స్థితిలో అనేక రోడ్లు కనిపించాయి. రూ.13.70 కోట్లతో 22 పనులు చేపట్టి 83.27 కి.మీ.ల ఆర్ అండ్ బీ రోడ్లు బాగు చేయించాం. పీఆర్ శాఖలో రూ.20.26 కోట్లతో 269 పనులు చేపట్టి 41.5 కి.మీ. సీసీ రోడ్లు వేయించాం. రూ.27.56 కోట్లతో తారు రోడ్లు వేయించాం. ఓజిలి కరబల్లవోలు రోడ్డు నుంచి అయ్యవారిపాలెం వరకూ రూ.8.38 కోట్లతో రోడ్డు వేయించాం. నాయుడుపేట ఎన్‌హెచ్ 16 నుంచి కమ్మవారిపాలేనికి రూ. 4.30 కోట్లతో బీటీ రోడ్డు వేస్తున్నాం. నాయుడుపేట నుంచి చిగురుపాడు అగ్రహారానికి రూ.1.95 కోట్లతో బీటీ రోడ్డు వేస్తున్నాం. తడ ఎంసీ రోడ్డు నుంచి బీవీ పాలేనికి రూ.63 లక్షలతో బీటీ రోడ్డు వేస్తున్నాం. రూ. 12.30 కోట్లతో పెళ్లకూరు మండలంలో కాళంగిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. ఇంకా రూ.1.05 కోట్లతో నాలుగు అంగన్‌వాడీ భవనాలు నిర్మించాం.ఐసీడీఎస్ ఆఫీసు భవనానికి మరమ్మతులు చేయించాం.పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో మొత్తం రూ.47.82 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

● తాగునీటికి ప్రాధాన్యం ఇచ్చా. ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా రూ.12.19 కోట్లతో 176 పనులు పూర్తి చేయించాం. రూ.65.24 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశాం. తెలుగు గంగ కాలువల అభివృద్ధికి రూ.64.69 లక్షలతో 12 పనులు చేయించాం. రూ.4.31 కోట్లతో 187 గోకులం షెడ్లు నిర్మించాం. రూ.41.12 లక్షలతో బీసీ హాస్టళ్లను అభివృద్ధి పరిచాం.

● రూ.57.64 కోట్ల ఉపాధి హామీ నిధులతో 126 పనులు పూర్తయ్యాయి.

ఎమ్మెల్యే గారూ.. మీరిచ్చిన హామీలే ఇవి!

● సూళ్లూరుపేట సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు పూర్తి చేసి తాగునీటిని అందించడం ● దొరవారిసత్రం మండలంలో 14 ఆర్ తెలుగు గంగ కాలువ నిర్మాణం పూర్తి చేయించడం ● నాయుడుపేట మండలం జువ్వలపాలెం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు పూర్తి చేయించడం ● నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నదిలో చెక్ డ్యాములు నిర్మించడం ● సూళ్లూరుపేట వద్ద కాళంగి నదిపైన, నాయుడుపేటలో స్వర్ణముఖి నదిపైన వంతెనల నిర్మాణం.



అసంపూర్తిగా వున్న సూళ్ళూరుపేట సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం



4.47 కేజీల వెండి విరాళం

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి గుంతకల్లుకు చెందిన రాజు అనే వ్యాపారి 4.47 కేజీల వెండిని విరాళంగా సమర్పించారు. శనివారం దాత కుటుంబ సమేతంగా ముక్కంటి ఆలయానికి విచ్చేశారు. ఆలయ పరిపాలనా భవనంలో ఈవో బాపిరెడ్డిని కలిసి వెండి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతను ఘనంగా సత్కరించి, ప్రత్యేక దర్శనం కల్పించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో - చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆటోను గుర్తుతెలియని కారు ఢీకొట్టి వెళ్లడంతో 8 మంది గాయపడిన ఘటన శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి పంచాయతీ కోళ్లఫారం సమీపంలో శనివారం సాయంత్రం పీఎస్ జాతీయరహదారిపై జరిగింది. బాధితుల కథనం మేరకు... శ్రీకాళహస్తి మండలం ఎగువవీధి గ్రామానికి చెందిన మౌనిష్ అనే యువకుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నాడు. 8 మంది కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఉదయం గూడూరు సమీపంలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి ఆటోలో వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి ఆటోలో బయలుదేరారు. కోళ్ల ఫారం దగ్గర జాతీయ రహదారిపై గుర్తు తెలియని కారు ఆటోను ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఆటో రోడ్డు పక్కకు బోల్తా కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న మౌనిష్‌తోపాటు జాహ్నవి, సుబ్బయ్య, అంకమ్మ, విశాలాక్షి, అన్విత్(5) షర్మిల(4) గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు ఘటనపై బాధ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

లారీని ఢీకొన్న కారు

● ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పెళ్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ నాగరాజు తెలిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మెహంతి సరస్వతి కుటుంబం హైదరాబాదులో నివాసం ఉంటోంది. శనివారం కుటుంబ సభ్యులందరూ కారులో హైదరాబాదు నుంచి తిరుమలకు బయలుదేరారు. పెళ్లకూరు మండలంలోని ఎగువచావాలి వద్దకు రాగానే వెనుక వస్తున్న లారీ ఓవర్‌టెక్ చేసి ముందు వెళ్తూ షడన్ బ్రేక్ వేసింది. దీంతో కారు లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మెహంతి సరస్వతి(50), ఆమె భర్త గోవిందరాజు, కుమార్తె సాయినవ్య, లహరి, చెల్లెలు మీన తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా మెహంతి సరస్వతి మృతి చెందారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం పూర్తి చేశాక బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసిటీలో అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు



సంకీర్తనలు ఆలపిస్తున్న మల్లాది అనూష

సత్యవేడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన అన్నమయ్య పంచామృత వర్షిణి కార్యక్రమం సంగీత ప్రియులను అలరించింది. హైదరాబాదుకు చెందిన ప్రఖ్యాత అన్నమాచార్య కీర్తనల పండితుడు గంధం బసవ శంకరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన కుమారి మల్లాది అనూష వాయిద్య కళాకారులతో కలిసి 'బ్రహ్మమొక్కటే, అదిగో అల్లదిగో, చక్కని తల్లికి, చిన్ని శిశువు' తదితర అన్నమయ్య సంకీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. కాగా కీర్తనల ముందు శంకరరావు ఆ కీర్తనలకు సంబంధించిన సారాంశాన్ని, గొప్పదనాన్ని వివరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తిరుపతి శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, ఎస్కే యూనివర్సిటీ మాజీ వీసీ కుసుమకుమారి కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి పల్లేటి బాలాజీ సమన్వయకర్తగా వ్యవహరించారు. శ్రీసిటీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సూళ్లూరుపేట, శ్రీహరికోట ప్రాంతాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీపీటీవో



తిరుపతి(ఆర్టీసీ)/ కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డీపీటీవోగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన జగదీష్ శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. కలెక్టర్ ఆయన్ను అభినందించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని, ప్రధానంగా రాబోవు శ్రీవారి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకొని ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.

నాందేడ్-తిరుపతి మధ్య 16 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్) జూన్28(ఆంధ్రజ్యోతి) తిరుపతిలో నెలకొన్న ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి నాందేడ్ -తిరుపతిల మధ్య 16 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. కాగా 8 సర్వీసులు ఒక మార్గంలో, 8 సర్వీసులు మరో మార్గంలో నడుపనున్నామని వెల్లడించారు. ఈ ప్రత్యేక రైళ్లు జూలై 4నుంచి 27వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయన్నారు. ● ఈ ప్రత్యేక రైలు(07189)నాందేడ్‌లో జూలై 4వ తేదీ శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి ముడికేడ్, దర్మాబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చర్ల, చర్లపల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడుకుడి, పిడుగురాళ్ల, నెమలిపురి, రొంపిచర్ల, వినుకొండ, దొనకొండ, మార్కాపురంరోడ్డు, కుంబ్బం, గిద్దలూరు, దేవరమిట్ట, నంద్యాల, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, కడప, నందలూరు, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా మరుసటి రోజు మధ్యాహ్నం 12.30గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. ● తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07190) శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ ఆదివారం ఉదయం 9.30 గంటలకు నాందేడ్ చేరుకొంటుంది. ● ఈ ప్రత్యేక రైలు(07015)నాందేడ్‌లో జూలై 5వ తేదీ శనివారం సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి ముడికేడ్, దర్మాబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చర్ల, మల్కాజ్‌గిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబుబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూల్ సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా మరుసటి రోజు ఉదయం 10.10గంటలకు తిరుపతికి చేరుకొంటుంది.

● తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07016) ఆదివారం సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు నాందేడ్ చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైళ్లలో 1, 2, 3, ఏసీలతోపాటు సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లు, సాధారణ కోచ్‌లు కూడా ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హైదరాబాదులో పట్టుబడ్డ ఏనుగు దంతాలు

భాకరాపేటలో చోరీకి గురైనవేనా..?

● అటవీ శాఖలో కలకలం ● చోరీకి గురైన గన్ ఎక్కడ?

తిరుపతి (మంగళం) జూన్ 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పోలీసులకు చిక్కిన ఏనుగు దంతాలు భాకరాపేట అటవీశాఖ రేంజ్ ఆఫీసులో చోరీకి గురైనవేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏనుగు దంతాలను తరలిస్తూ పట్టుబడ్డ డ్రైవర్ ప్రసాద్ అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందినవాడు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ ఫిబ్రవరిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కి జైలుకు కూడా వెళ్లాడు. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ బస్సులో ప్రయాణిస్తున్న అతని వద్ద ఏనుగు దంతాలు లభించడం సంచలనమే సృష్టించింది. తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల్లోని అడవుల్లో గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ హయాంలో ఏనుగులను చంపి వాటి దంతాలను స్మగ్లింగ్ చేశారు. ఆ తర్వాత తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఏనుగులను వేటాడి చంపిన దాఖలాలు లేవు. తాజాగా ప్రసాద్ చేత పట్టుబడ్డ ఏనుగు దంతాలు ఎక్కడివి అనే ప్రశ్న అందరిరీ కలవరపాటుకు గురిచేస్తోంది. అటవీ శాఖ అధికారులు దీనిపై అంతర్గతంగా విచారణ చేపట్టినట్లు సమాచారం.

విచారణాధికారిని నియమించాం : సీసీఎఫ్ సెల్వం

ఈ వ్యవహారంలో విచారణ అధికారిగా అన్నమయ్య జిల్లా డీఎఫ్‌ఓ జగన్నాథ్ సింగ్‌ను నియమించాం.హైదరాబాద్ పోలీసులతో కేసుకు సంబంధించిన ఫైల్ తెప్పించి పట్టుబడ్డ ఏనుగు దంతాలు ఎక్కడ నుంచి స్మగ్లింగ్ జరిగాయి అన్న దానిపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తాం.

భాకరాపేట అటవీ శాఖ కార్యాలయంలో చోరీ..

2013లో తలకోన అటవీ ప్రాంతాల్లో రెండు ఏనుగులు ప్రమాదవశాత్తు మృతి చెందాయి. ఇందులో ఒక ఏనుగుకు సంబంధించిన దంతాలు పోస్టుమార్టం అనంతరం తొలగించి భాకరాపేట రేంజ్ ఆఫీసులో భద్రపరిచారు. అయితే 2023లో భాకరాపేట రేంజ్ ఆఫీసులో ఉన్న ఏనుగు దంతాలతో పాటుగా ఒక గన్ కూడా చోరీకి గురైంది. దీనిని గుర్తించిన అటవీశాఖ అధికారులు భాకరాపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ కేసులో నిందితులు ఎవరో గుర్తించలేకపో యారు. అయితే ఈ చోరీ జరిగిన విషయం రహస్యంగా ఉంచారు. అటవీ శాఖ ఉన్నతాధికారులకు సైతం ఈ విషయం తెలుసా అన్నది అనుమానంగానే ఉంది. భాకరాపేట పోలీస్‌స్టేషన్లో 87-23 నంబర్‌తో కేసు కూడా నమోదైంది.

అటవీశాఖ అధికారులు గుబులు

దాదాపు ఒకటిన్నర సంవత్సరం తర్వాత భాకరాపేట రేంజ్ ఆఫీసులో అదృశ్యమైన దంతాలు హైదరాబాదులో పట్టుబడ్డ దంతాలు ఒకటేనేమో అన్న అనుమానంతో అటవీశాఖ అధికారుల్లో గుబు లు మొదలైంది. ఏనుగు దంతాలు, గన్ కావడంతో బయటకు చెప్పుకుంటే పరువు పోతుందని అటవీ శాఖ అధికారులు భయపడ్డా నేడు బయట పెట్టడం అనివార్యంగా కనిపిస్తోంది. హైదరాబాద్‌లో దొరికిన ఏనుగు దంతాలతో పాటు గన్ కూడా ప్రసాద్ వద్ద ఉండా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.